ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 ఆగస్టు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0

గంజాయి వలలో యువకులు

- విశాఖ నుంచి తీసుకొచ్చి విక్రయాలు
- కూపీలాగిన కైకలూరు పోలీసులు
- ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరి అరెస్టు 2.5 కేజీల గంజాయి స్వాధీనం

ఏపీ నిట్‌లో ఘనంగా స్నాతకోత్సవం

- 887 మంది విద్యార్థులకు డిగ్రీలు, 29 మందికి డాక్టరేట్ పట్టాలు అందజేత

■ లోపలి పేజీలో..






రక్షా బంధన్

సోదరీమణులు, సోదరుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి)ని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. కాగా ఉండవల్లిలో చంద్రబాబు నాయుడుకు మాజీ మంత్రి పీతల సుజాత రాఖీ కట్టారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటికి నియోజకవర్గ మహిళలు, భీమడోలులో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, చింతలపూడిలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు మాజీ జడ్పీటీసీ తాళ్ళూరి రాధారాణి రాఖీ కట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

ఘనంగా దసరా ఉత్సవాలు

- మంత్రి కొలుసు

నూజివీడు,ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన నూజివీడు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. పట్టణంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో అధికారులు, నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైసూరు ఉత్సవాలను తలపించేలా నిర్వహించాలని, ఎటువంటి ఆటంకాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో సంయుక్తంగా పని చేయాలన్నారు. తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీశ్ పాల్గొన్నారు.

వేలేరుపాడులో భారీ వర్షం

వేలేరుపాడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలవాసులు శనివారం సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో సతమతమవ్వగా సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం మండలాన్ని ముంచెత్తింది. రెడ్డిగూడెం కాజ్‌వే వద్ద వరదనీరు పొంగి రాకపోకలు స్తంభించాయి. ఇటీవల ఎన్నడు లేనంతగా భారీ వర్షం కురవడంతో పాటు భారీ ఈదురుగాలులు వీచడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద భారీవృక్షం విరిగి ఒక ఆటోమొబైల్ షాప్‌పై పడటంతో షాపు పూర్తిగా ధ్వంసమైంది. చెట్టుపడిన సమయంలో ఆ షాపులో ఉన్నవారు బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం జరగలేదు. పలు చోట్ల చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



ప్లాస్టిక్‌పై.. పోరు

- ఆలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు
- స్వచ్ఛాంధ్రలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం నిర్ణయం

ద్వారకాతిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో వుంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించింది. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ కె.రామ చంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆలయాల్లో పనిచేసే జాయింట్, డిప్యూటీ, సహాయ కమిషనర్లు ఈ ఆదేశాలను తప్పని సరిగా అమలు చేయాలి. సాధారణంగా ఆలయాల్లో పూజా సామగ్రి దుకాణాలు, ప్రసాదాల కౌంటర్ల వద్ద సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతుంటాయి. ఇలాంటి వాటికి చెక్ చెప్పాలని నిర్ణయించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రముఖ ఆలయాలైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి, భీమవరం మావుళ్ళమ్మ, జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు కోట సత్తెమ్మ, పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వర స్వామి ఆలయాల ప్రాంగణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను, ఏ ఆకారంలో ఉన్న నాన్ ఓవెన్ బ్యాగ్‌లైనా వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిలుపుదల చేయాలి. దేవస్థానం పాట దుకాణాల్లో సైతం వీటి వినియోగాన్ని నిషేధించాలి. ఆలయాలను ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు, ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతీ ఆలయంలోని సిబ్బందిలో సీనియర్‌ను నోడల్ అధికారిగా నియమిస్తారు. ఆ అధికారి ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను పరిశీలిస్తూ ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూస్తారు. ఈవోలు తరచూ తనిఖీలు చేస్తారు.. ఇటీవల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆలయా ల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ కోరిక మేరకు ఈ విధంగా నిర్ణయిస్తూ ఆదేశాలిచ్చారు.

ఆలయాల్లో బోర్డుల ఏర్పాటు

ఆయా ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలును సూచిస్తూ ఆలయ ఆవరణ బయట, లోపల బోర్డులు ఏర్పాటు చేయాలి. కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు తరచూ మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయాలి. ఆలయ ప్రాంగణం సమీపంలో వ్యాపారాలు చేసే పాట దుకాణదారులు ఎవరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్

(మిగతా 8వ పేజీలో)

ఆలయాల్లో నిషేధించినవి.. వినియోగించాల్సినవి

- దేవాలయాల పరిధిలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న కవర్ల వినియోగం నిలిపివేయాలి. వాటి స్థానంలో కాటన్, జ్యూట్ బ్యాగ్‌లు, క్లాత్‌సంచిలు వినియోగించాలి.
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, బౌల్స్, స్పూన్ల వినియోగం నిషేధం. వాటిస్థానంలో ఆకులతో తయారు చేసిన లేదా ఫుడ్ గ్రేడ్ లామినేటెడ్ పేపర్ ప్లేట్లు, కప్పులు వాడాలి.
- థర్మోకోల్ ఐటమ్స్ బదులుగా స్టీల్, సెరామిక్ ఐటమ్స్ వాడాలి.
- ప్లాస్టిక్ స్ట్రాలు, జెండాలు, బ్యానర్లు బదులు 100 మైక్రాన్ కంటే ఎక్కువైన క్లాత్, వెదురుతో తయారైనవి వాడాలి.
- వస్త్రం, పేపరుతో తయారు చేసిన సంచుల్లోనే ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయాలి.
- భక్తులకు అన్నప్రసాదాన్ని అరటి ఆకులు, లేదా స్టీల్ ప్లేట్‌లలోనే వడ్డించాలి.
- మంచినీటికి ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగం నిషేధించి దానికి మారుగా ఆలయ పరిధిలో ఆర్వో మంచినీటి ప్లాంట్‌లను ఏర్పాటుచేయాలి. అక్కడ స్టీలు గ్లాసులను వాడకానికి ఉంచాలి. క్యూలైన్లలో ఉన్న భక్తులకు అందించేందుకు వలంటీర్లు సిద్ధంగా ఉండాలి.

ఇంజనీరింగ్.. గందరగోళం



- సెకండ్ కౌన్సెలింగ్ మొదలు కాకుండానే రేపటి నుంచి తరగతులు
- 80 శాతం మందికి ఓకే.. మిగిలిన వారి పరిస్థితి ఏమిటి ?
- నచ్చిన కాలేజ్, బ్రాంచ్ రాలేదని మరో కౌన్సెలింగ్‌కు వెయిటింగ్
- ఈలోగా తరగతులకు రావాలని కళాశాలల నుంచి సందేశాలు
- సర్టిఫికెట్లు సమర్పించాలి.. ఫీజులు చెల్లించాలి
- తర్వాత కళాశాల మారితే ఎలా ? అని విద్యార్థుల ఆందోళన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించకుండానే.. తరగతులకు రండి అంటూ విద్యార్థులకు మెసేజ్‌లు వెళుతున్నాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో తమకు నచ్చిన బ్రాంచ్, కాలేజ్ రాని వారంతా రెండో విడత కౌన్సెలింగ్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో సోమవారం నుంచి తరగతులు ప్రారంభిస్తున్నాం.. సీట్లు పొందిన వారంతా సర్టిఫికేట్లు సమర్పించాలని యాజమాన్యాలు స్పష్టం చేయడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. సీటు పొందిన విద్యార్థులు తరగతులకు హాజరైతే అడ్మిషన్ ఫీజులు, హాస్టల్ ఫీజులు చెల్లించాలి. ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇచ్చేయాలి. రెండో విడత కౌన్సెలింగ్‌లో తమకు నచ్చిన కళాశాలలో సీటు వస్తే అప్పటికే అడ్మిషన్ తీసుకున్న కళాశాల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇచ్చేందుకు సిద్ధపడతాయా అనేది అనుమానమేనంటూ విద్యార్థులు గుబులు చెందుతున్నారు. అయితే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని కళాశాలలు విద్యార్థులకు భరోసా ఇస్తున్నాయి. రెండో విడత కౌన్సెలింగ్ కోసం చూసిన వారంతా సర్టిఫికేట్లు ఇవ్వకుండానే కళాశాలలకు రావాలని సూచిస్తున్నాయి. వాస్తవానికి తెలంగాణలో ఇంటర్ చదివిన విద్యార్థులకు ఇక్కడ లోకల్ సీట్లు కేటాయించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో రెండో కౌన్సెలింగ్ నిలిచిపోయింది. అదే ఇప్పుడు తొలి విడత సీట్లు ఖరారైన విద్యార్థులకు శాపంగా మారింది. ఏటా పది నుంచి 15 శాతం మంది విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో మారుతుంటారు. వేరే కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఈ ఏడాది న్యాయపరమైన చిక్కులతో రెండో కౌన్సెలింగ్ నిర్వహించలేదు.

ఇంజనీరింగ్‌లో జోష్

ఈ ఏడాది ఉభయ గోదావరి జిల్లాలో రెండు మినహా మిగిలిన కళాశాలల్లో తొలి విడతలోనే దాదాపు సీట్లు భర్తీ అయిపోయాయి. స్పోర్ట్స్ ఎన్‌సిసి కోటాలో భర్తీ చేయక పోవడంతో ఆ సీట్లు మాత్రమే మిగిలాయి. అవి కూడా రెండో విడతలో పూర్తి కానున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 8,012 సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ అయ్యాయి. రెండు జిల్లాల్లోనూ ఆరు కళాశాలల్లో కన్వీనర్ కోటాలో కేటాయించిన సీట్లన్నీ భర్తీ అయిపోయి వంద శాతం నమోదు చేసుకున్నాయి. మరో మూడు కళాశాలల్లో 95 సీట్లు భర్తీ అయ్యాయి. మెకానికల్, కెమికల్, బయో టెక్నాలజీ, ట్రిపుల్ ఈఈఈ వంటి కోర్ సబ్జెక్ట్‌లోనూ ఈసారి పోటీ ఏర్పడింది. 80 శాతం మందికి తాము ఎంచుకున్న కళాశాలల్లో సీట్లు లభించాయి. మిగిలిన వారు రెండో కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి వుంది.



ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- అంబరాన్నంటిన ఆదివాసీల సంబరాలు

బుట్టాయగూడెం,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): 'ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించాలి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా స్వయం సమృద్ధిని సాధించాలి.' అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. కేఆర్‌పురంలోని ఐటీడీఏ వద్ద శనివారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పీవో కె.రాములు నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. పీవో జాతీయ జెండాను, ఎమ్మెల్యే బాలరాజు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. ఆదివాసీ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు విద్యపై ఆదివాసీలంతా విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం తెలిపారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఐటీడీఏ ద్వారా ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని పీవో రాములు నాయక్ వివరించారు. పీఎం జన్‌మన్‌లో కొండరెడ్డి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వివిధ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. వివిధ శాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. డీడీ శ్రీవిద్య, ఏపీవో శ్రీనివాస రావు, ఎస్‌డీసీ కిశోర్, ఐసీడీఎస్ పీడీ శారద, ఎంపీపీ కారం శాంతి, జడ్పీటీసీ మొడియం రామతులసీ, గడ్డమణుగు రవికుమార్, సర్పంచ్ బుజ్జి, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థినుల నృత్యం

స్త్రీ శక్తి.. బస్టాండ్లకు కొత్తశోభ

- ఉచిత బస్సు పథకంతో సౌకర్యాలకు పెద్దపీట
- తుది మెరుగులతో ఆర్టీసీ ప్రాంగణాలు కళకళ
- రేపు విధి విధానాలు ఖరారుకు అవకాశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాల పుణ్యమా అంటూ బస్టాండ్లు బాగు పడుతు న్నాయి. ఈనెల 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. స్త్రీ శక్తి కింద నామకరణం చేశారు. ప్రయాణాల విషయంలో మహిళలకు అన్ని సౌకర్యాలుండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ దిశగా డిపో మేనేజర్లు, డీపీటీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. ఎక్కడా ఏ లోపం తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఏలూరు కొత్తబస్టాండ్‌లో అన్ని ఫ్లాట్‌ఫారాల వద్ద విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయి. కొద్ది నెలలు క్రితం చిమ్మచీకట్లతోనే ఆర్టీసీ ప్రాంగణం ఉండేది. ఇప్పుడున్న టాయిలెట్లను పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేయించారు. మంచినీటి వసతులను పెంచారు. దాతలు ఇచ్చిన వాటికి ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అదనంగా కొత్తగా టాయిలెట్లను కడుతున్నారు. జంగారెడ్డిగూడెంలో ప్రత్యేకంగా టాయిలెట్లు కట్టడం పూర్తి చేశారు. నూజివీడులో గ్యారేజ్‌లో షెడ్లు బాగు చేతను చేపట్టారు. త్వరలో చింతలపూడి, ముదినేపల్లి బస్టాండ్‌లలోను సౌకర్యాలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.



రేపు విజయవాడలో సమీక్ష...

ఈనెల 15 నుంచి ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణాల సన్నద్ధతపై ఈనెల 11న విజయవాడలో ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం డీపీటీవోలతో సమావేశం నిర్వహించనున్నారు. అధికారులు సన్నద్ధత, జీరో టిక్కెట్ జారీ, బస్సులను ఏ మేరకు సన్నద్ధం చేసింది, ఇంకా ఏమీ చేయాలో ప్రతిపాదలనలపై సమీక్షించే అవకాశాలున్నాయి. ఈ మేరకు ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లు, ఇతర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. జిల్లాలో ఉచిత ప్రయాణాలకు ఐదు రకాల 190 బస్సుల వరకు సిద్ధం చేశారు. సంఖ్య ఎంతనేది ఈ సమీక్షలో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణాలకు ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేశామని డీపీటీవో షబ్నం తెలిపారు.



ఏలూరులో రంగులు వేసిన టాయిలెట్లు

రోడ్డు విస్తరణ.. విగ్రహాల తరలింపు



జీలుగుమిల్లిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

జీలుగుమిల్లి, ఆగస్టు 9: ఎన్‌హెచ్ విస్తరణలో పనుల్లో భాగంగా జీలుగుమిల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని తొలగించాల్సి వస్తోంది. దీంతో ముందస్తుగానే విగ్రహాలను మరోచోటుకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. శనివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి వేద పండితులు, అర్చకులు టిఎస్.రామకృష్ణశర్మ, ఆలయ ధర్మకర్త కోరుకొండ జనార్దనరావు, ఓరుగంటి శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం విగ్రహాలను తొలగించి రామాలయంలో తాత్కాలికంగా ఉంచేందుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నూతన ఆలయం నిర్మాణ స్థలం కోసం చర్యలు చేపట్టి ఆలయ నిర్మాణానికి గ్రామ పెద్దలు సహకరించాలని అర్చక స్వాములు కోరారు.



ఆలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి



ఆలయంలో విగ్రహాలు తొలగించిన దృశ్యం



పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

కానిస్టేబుళ్ల ట్రైనింగ్ సెంటర్ పరిశీలన

దెందులూరు,ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామ పరిధిలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్లకు ట్రైనింగ్ ఇచ్చేందుకు సౌకర్యాలను జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్, ఏఎస్పీ సూర్య చంద్రారావు శనివారం పరిశీలించారు. శిక్షణ తరగతుల గదులను, కంప్యూటర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ట్రైనింగ్ ఇచ్చే నిమిత్తం ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బంది భోజనం, వసతి సౌకర్యాలు, తాగునీరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ ప్రసాద్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ రామా రావులకు సూచించారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ఐ పవన్ కుమార్, ఎస్ఐలు విజయ్‌కుమార్, శంకర్, రామకృష్ణ ఉన్నారు.

గోల్డ్ మెడల్ పొందిన విద్యార్థుల అభిప్రాయాలు

శాస్త్రవేత్తగా రాణించడమే లక్ష్యం



మా నాన్న కృష్ణంరాజు స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ మధు గృహిణి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లో 9.70 గ్రేడు పాయింట్లు సాధించి ఇనిస్టిట్యూట్ టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. నేను బెంగళూరులోని ఐఐఎస్సీలో ఎంటెక్ చేస్తున్నా. ముందు నుంచి అర్థం చేసుకుని చదవడం అలవాటు. ఆ అలవాటే టాపర్‌గా చేసింది. భవిష్యత్‌లో శాస్త్రవేత్తగా రాణించాలనేది నా లక్ష్యం

- కలిదిండి పీటీఎస్ వర్మ, భీమవరం (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)

'యూపీఎస్సీ'లో ఉద్యోగం సాధిస్తా..



మా నాన్న తమ్మన్న రైతు. అమ్మ లత దేవాదాయ శాఖలో తహసీల్దార్. ప్రస్తుతం మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ చేస్తున్నా. బయో ఇంజనీరింగ్‌లో 9.33 గ్రేడు పాయింట్లు సాధించడం చాలా ఆనందంగా ఉ ంది. ఆచార్యులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని అర్థం చేసుకునేవాన్ని. గ్రంథాలయానికి ఎ క్కువ సమయం కేటాయించేవాన్ని. భవిష్యత్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్‌లో ఉద్యోగం సాధించాలనేదే జీవిత ఆశయం.

- శశాంక్, కర్ణాటక, (బయో ఇంజనీరింగ్)

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



మా నాన్న వైజాగ్‌లోని టయోటా కంపెనీలో విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. కెమికల్ ఇంజనీరింగ్‌లో 8.82 గ్రేడు పాయింట్లు సాధించడం అనందంగా ఉంది. ప్రస్తుతం బెంగళూరులోని ఐఐఎస్సీ విద్యా సంస్థలో ఎంటెక్ కోర్సు చదువుతున్నా. నా తల్లిదండ్రులు చదువులో నన్ను ఎంతో ప్రొత్సహించారు. భవిష్యత్‌లో ప్రభుత్వ కొలువు సాధించాలనేదే నా లక్ష్యం

- సంగెపు అభినవ్, వైజాగ్ (కెమికల్ ఇంజనీరింగ్)



వి.రాజన్నతో నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు, ఆచార్యులు..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి రాజన్న

దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది యువ ఇంజనీర్లే..

టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్న

» ఘనంగా ఏపీ నిట్ స్నాతకోత్సవం » 887 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాల అందజేత

తాడేపల్లిగూడెంఅర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీల్లో భారత్ అగ్రగామిగా ఉందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్, టెక్నాలజీ) ప్రెసిడెంట్ వి.రాజన్న అన్నారు. శనివారం తాడేపల్లిగూ డెంలోని ఏపీ నిట్‌లో ఏడో స్నాతకోత్సవ వేడుకను ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు డిజిటల్ టెక్నాలజీలే ప్రధాన చోదకశక్తిగా మారనున్నాయన్నారు. దేశభవిష్యత్‌ను నిర్ణయించేది యువ ఇంజనీర్లేనని ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత దేశం అవతరించబోతుందన్నారు. 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు, యూపీఐ ద్వారా ఏటా వంద బిలియన్లకుపైగా లావాదేవీలు నిర్వహిస్తుం దన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నచ్చిన పుస్తకాలను చదవడం, సంగీతం వినడం ద్వారా ఒత్తిడిని అధికమించవచ్చన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రమణారావు మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్నాయని వాటిలో మెలకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారే అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారన్నారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ నూతన ప్రాజెక్టులు చేపడితే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అనంతరం 2021-25 బ్యాచ్‌లో బీటెక్‌లో నాలుగేళ్ల ఇంజనీరింగ్ పూర్తి చేసిన 887 మంది విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీ పూర్తి చేసిన 29 మందికి డాక్టరేట్ పట్టాలతో బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జీ.రవికిరణ్‌శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎస్.జయరాం, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

అధికారుల తీరుపై 'పాకా' అసహనం

» ఎక్కడా లేని నిబంధనలు ఇక్కడే ఎందుకు పెడుతున్నారంటూ ఆగ్రహం

స్నాత కోత్సవ వేడుకలలో ఏపీ నిట్ అధికారుల తీరును రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ తప్పుబట్టారు. వాస్తవానికి తాడేపల్లిగూడెం ఏపి నిట్‌లో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీలు, డాక్టరేట్ పట్టాలను అందుకోనున్న విద్యార్థుల తల్లిదండ్రులను నిట్ అధికారులు పిలిచారు. తమ పిల్లలు పట్టాలు తీసుకునేప్పుడు చూసి ఆనందిద్దామన్న ఆశతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ కుటుంబసభ్యులతో సుమారు రెండు వేల మంది వేడుకకు హాజరయ్యారు. అయితే నిట్‌లో ఉన్న రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఈ వేడుకను అధికారులు నిర్వహించారు. ఆ ఆడిటోరియంలో 800మంది మాత్రమే వెళ్లగలుగుతారు. తొలుత వచ్చిన వారినందరిని అధికారులు ఆడిటోరియంలోకి పంపించారు. స్థలం సరిపోని కారణంగా చాలామంది ఆడిటోరియం వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో వారందరూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అప్పుడే కార్యక్రమానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. స్థలం సరిపోనప్పుడు బయట ఏర్పాటు చేయాలి తప్పా కొద్దిమందికే అనుమతి అంటూ తమను అధికారులు బయటే ఆపేశారంటూ పాకాకు విన్నవించారు. ఈమేరకు నిట్ అధికారుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని నిబంధనలు ఈ నిట్‌కు మాత్రమే ఎందుకు అంటకడుతు న్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిస్థితి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. దీనిపై నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావుతో మాట్లాడారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



మా నాన్న సుందరబాబు అకౌంటెంట్. అమ్మ నాగలక్ష్మి గృహిణి. సివిల్ ఇంజనీరింగ్‌లో 9.44 గ్రేడు పాయింట్లు సాధించినందుకు ఆనందపడుతున్నా. ప్రస్తుతం చెన్నైలోని ఎల్‌అండ్‌టీ కంపెనీలో త్రీడి మోడలింగ్ డిజైనర్‌గా పనిచేస్తున్నా. నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఏరంగంలోనైనా రాణించవచ్చు. భవిష్యత్‌లో అధికారిణిగా స్థిరపడాలనేదే నా లక్ష్యం

- తమ్ము హరిత, అవనిగడ్డ (సివిల్ ఇంజనీరింగ్)

నాన్న చదువులో ప్రోత్సహించారు



మా నాన్న యోగేంద్రసింగ్ రైతు. ఈఈఈలో 9.42 గ్రేడు పాయింట్లు సాధించడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం రిలియన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ.. రూ 7.50 లక్షల జీతాన్ని అందుకుంటున్నా. చిన్నపటి నుంచి నాన్న నన్ను చదువులో ఎంతో ప్రోత్సహించారు. ఆయన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిలబెట్టుకున్నందుకు గర్వంగా ఉంది.

- ఆదిత్య ప్రతాప్‌సింగ్, ఉత్తరప్రదేశ్ (ఈఈఈ)

గూగుల్‌లో జాబ్ సంపాదిస్తా..



మా నాన్న సత్తిబాబు రైతు, అమ్మ సాయి స్వప్నదేవి . కమ్యునికేషన్ ఇంజనీరింగ్‌లో 9.48 గ్రేడు పాయింట్లు సాధించడం చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతం అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ డెవలెప్‌మెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ రూ.19 లక్షలు జీతాన్ని అందుకుంటున్నా. గూగుల్ కంపెనీలో ఉద్యోగం సాధించి ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే లక్ష్యం.

- చిత్తడి ధనూషాలక్ష్మి, నిడదవోలు (కమ్యూనికేషన్ ఇంజనీరింగ్)

సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగం సాధిస్తా..



మా నాన్న విజయ్‌కుమార్, అమ్మ కృపాదాసి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఇద్దరూ ఉపాధ్యాయులు కావడం వల్ల చదువులో నన్నెంతగానే ప్రోత్సహించారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో 9.33 గ్రేడు పాయింట్లు సాధించడం చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతం ముంబైలోని ఎల్‌అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం చేస్తూ రూ.6 లక్షల వేతనం తీసుకుంటున్నా. సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగం సాధించాలనేది లక్ష్యం.

- పుడిముడి ప్రియాంక, (మెకానికల్ ఇంజనీరింగ్)



వేదమాతకు పూజల్లో పాల్గొన్న పండితులు

'వేదాలను సమాజ శ్రేయస్సుకు వినియోగించాలి'

» ఉత్తీర్ణులైన వేద విద్యార్థులకు యోగ్యతాపత్రాల పంపిణీ

గణపవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతి సంప్రదా యాలను ఇనుమడింప చేసే వేదాలను పరిరక్షించి వాటిలోని సారాన్ని సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పలువురు వేదపండితులు పిలుపునిచ్చారు. శ్రావణ శుద్ధపౌర్ణమి పురస్కరించుకుని శనివారం సరిపల్లెలోని శ్రీసఖ్యాభివర్ధక నిలయం, టీటీడీ కల్యాణ మండపంలో 105వ వేద పరిషత్ సభను వేదమంత్రాల ఘోషలో కన్నులపండువగా నిర్వహించారు. గణపవరానికి చెందిన దివంగత కూసంపూడి సుబ్బరాజు, వెంకటసుబ్బమ్మ, దెందుకూరి సుశీల, సాగిరాజు వరలక్ష్మి జ్ఞాపకార్థం, స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం నేతృత్వంలో వేదపరిషత్ సభ, వేదమాతకు ప్రత్యేకపూజలను పండితులు నిర్వహించారు. తొలుత వేదమాతను పురవీధుల్లో ఊరేగించి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. దేశంలోని తిరుమల తిరుపతి దేవస్థానం, రాజస్థాన్, గుజరాత్, బిహార్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150మంది వేదవిద్యార్థులు పాల్గొన్నారు. వేదపండితులను సాగిరాజు సుబ్బరాజు, ఆయన తనయుడు సాగిరాజు సాయి కృష్ణవరప్రసాద్ కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన సభలో సత్కరించారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన వేదవిద్యార్థులకు యోగ్యాతపత్రాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.



మహామంత్రి తిమ్మరుసు, కవులతో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయులు గణపతి

అలరించిన 'భువన విజయం'

ఆకివీడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):'భువన విజయం' ద్వారా సంస్కృతీ, సంప్రదాయాలు తెలియజేస్తున్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం అన్నారు. హైందవీ పరిషత్, హైందవ శంఖారావం, ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో సాంస్కృతిక, సాహితీ రూపకం 'భువన విజయం' నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు ఏర్పరచిన భువన విజయం సభలో తెలుగు భాష, తెలుగు సాహిత్యాన్ని, భారతీయ కళావైభవం, కావ్యాలు, అష్టదిగ్గజాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, టీడీపీ క్లస్టర్ గొంట్లా గణపతి శ్రీకృష్ణదేవరాయల పాత్రను మైమరపించారు. మహామంత్రి తిమ్మరుసుగా తెలుగు పండితులు, కవి, ప్రవచన కర్త తెన్నేటి మాస్టారుతో పాటు అష్టదిగ్గజ కవులు అల్లసాని పెద్దన్న, నంది తిమ్మన, పింగళి సూరన్న, తెనాలి రామకృష్ణుడు, రామరాజ భూషణుడు, శివ, కవలి ధూర్జటి, మాదయ మల్లన, అయ్యలరాజు రామభద్రుడు పాత్రలు ఆకట్టుకున్నాయి. విదేశీ రాయబారి లంక జలదుర్గప్రసాద్, పరదేశి కవి దర్భాదీక్షితులు పాత్రలు అలరించాయి. 'మా పాలనలో ఎన్నడూ అన్యాయం జరగనివ్వం' అని గణపతి అనడంతో సభ దద్దరిల్లింది. టీడీపీ పట్టణ కార్యదర్శి గంధం ఉమా, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, ఈశ్వరరావు, సన్నిధి వెంకన్నబాబు ఉన్నారు.

ప్రాణాలు పోవాల్సిందేనా ?

కాళ్లలో రాష్ట్రీయ రహదారిపై భారీ గొయ్యి.. తప్పని ఇబ్బందులు





కాళ్ళ ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహనాలు వెళ్లే రహదారిపై ఏర్పడ్డ గోతిలో పడి పదుల సంఖ్యలో వాహనదారులు గాయాలపాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాళ్ల గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాళ్లలో హైస్కూల్ దాటిన తర్వాత బ్రాందీ షాపు సమీపంలో రాష్ట్రీయ రహదారిపై ఏర్పడ్డ చిన్న గొయ్యి అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ పెద్దగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. శనివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పంచాయతీ చెత్త సేకరణ చేసే వాహనంతోపాటు పలు వాహనాలు గోతిలో పడిపోయాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే వరకు పట్టించుకోరా..? అంటూ గ్రామస్థులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గొయ్యి పూడ్చే ఏర్పాట్లు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కన్నుల పండువగా.. పవిత్రారోపణ

కొనసాగుతున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల,ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని ఆలయంలో జరుగుతున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం పవిత్రారోపణ వేడుక కన్నుల పండువగా జరిగింది. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం యాగశాలలో అగ్ని ఆరాధన, చతుర్థకలశ స్నపనను అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి తొళక్క వాహనంపై ఉంచి అలంకరించి హారతులిచ్చారు ఆ తరువాత పవిత్రాలను అర్చకులు తమ శిరస్సులపై ఉంచుకుని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో ప్రదక్షిణలను నిర్వహించారు. అనంతరం ఆలయ గర్భాలయంలో కొలువైన శ్రీవారి మూలవిరాట్‌కు, అమ్మవార్లకు. ఉత్సవమూర్తులకు పవిత్రాలను ధరింపచేశారు. ఆ తరువాత హోమాలను జరిపారు.

మార్మోగిన గోవింద నామ స్మరణ

శ్రీనివాసా గోవిందా.. శ్రీవేంకటేశా గోవిందా.. అంటూ గోవింద నామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు వచ్చారు. క్రమేపీ భక్తుల రద్దీ ఆల యంలో పెరిగింది. దాదాపు 20 వేల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

బంగారు లక్ష్మీకాసుల హారం అందజేత

శ్రీవారికి ఓదాత కుటుంబం శనివారం సుమారు రూ.5.80లక్షలు విలువైన 65గ్రాముల బంగారు లక్ష్మీకాసుల హారాన్ని బహుమతిగా అందజేశారు. విజయవాడకు చెందిన దాసరి రాధాకృష్ణ కుటుంబసమేతంగా శ్రీవారి క్షేత్రానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించిన అనంతరం బంగారు ఆభరణాలను ఆలయ కార్యాలయంలో రసీదుతో సహా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఏఈవో పి.నటరాజారావు దాత కుటుంబానికి ఆభరణాలు అందుకున్న రసీదును అందించారు.



ద్వారకాతిరుమలలో వెండి తొళక్క వాహనంపై కొలువుదీరి ప్రదక్షిణకు వస్తున్న శ్రీవారు, అమ్మవార్లు.



దాత రాధాకృష్ణ కుటుంబానికి రసీదు అందిస్తున్న ఏఈవో (ఇన్‌సెట్లో) లక్ష్మీకాసుల హారం.

రెండోరోజు జిల్లాస్థాయి క్రీడా ఎంపిక పోటీలు

తణుకు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరిం చుకుని జిల్లాస్థాయి క్రీడాకారులు ఎంపిక పోటీలు రెండోరోజు శనివారం తణుకులోని పలు విద్యాసంస్థల్లో నిర్వహించారు. స్థానిక మాంటిస్సోరి స్కూలు, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, ఎస్సీఐఎం డిగ్రీ కాలేజి, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడా ప్రాంగణంలో ఎంపిక పోటీలు జరిగాయి. విలువిద్య, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకీ పోటీలు జిల్లా స్పోర్ట్సు అథారిటీ ఆఫీసర్ మల్లి రాజేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని పలు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.



విలువిద్య పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పవన్‌కుమార్‌కు మూడు స్వర్ణాలు

మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ద్వారకాతిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి అమ్మమ్మ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు. నాలుగేళ్ల వయస్సులో ఊహించని రీతిలో విద్యుత్‌షాక్ తగిలి చేయి తొలగించారు. తల్లిదండ్రులు రమేష్, వసంతి పేదరికంతో ఉన్నప్పటికీ.. అమ్మమ్మ డీపల్లి శశిరేఖ, తాతయ్య కోటేశ్వరరావు ప్రోత్సాహంతో ముందుకు సాగాడు. తనకు తెలిసిన పరుగునే నమ్ముకుని జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై సత్తాచాడు. ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలోని శ్రీవేంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం యువకుడు కస్సే పవన్‌కుమార్ విశాఖపట్నం పోలీస్ బ్యారక్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. వంద మీటర్ల రన్నింగ్‌ను 12 సెకన్లలోనూ, 200 మీటర్ల పరుగును 24.5సెకన్లలోనూ, లాంగ్ జంప్‌ను ఆరు అడుగుల ఎత్తులో పూర్తిచేసి మూడు స్వర్ణ పతకాలను సాధించాడు. తన చేతిని కోల్పోయిన తర్వాత పంగిడిగూడెం హైస్కూల్‌లో ఆరో తరగతి చదివేటప్పుడు వ్యాయామ ఉపాధ్యాయుడు మల్లయ్య అతడిలో వున్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. అనంతరం విశాఖపట్నంలోని పారా స్పోర్ట్స్ అసోసియేషన్‌లో ఐదేళ్లపాటు, ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో ఆడేందుకు విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నెలరోజుల పాటు ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ కోచ్ వంశీకృష్ణ వద్ద, నేషనల్ సర్టిఫైడ్ కోచ్ బాపూజీ వద్ద శిక్షణ పొందినట్లు తెలిపాడు. ఈ క్రమంలో ఆగస్టు 22 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్ లోని గ్వాలి యర్‌లో జరిగే జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపాడు. 2026లో బెంగళూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో చేరి దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యమని పవన్ వెల్లడించాడు. తన జీవితంపై భారత సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్న మామయ్య అనిల్‌కుమార్ ప్రభావం చూపిందన్నారు.



తణుకు బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో హాకీ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్తమ క్రీడాకారులుగా రాణించడమే లక్ష్యం

తణుకులో కొనసాగుతున్న జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు

తణుకు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని దాని లక్ష్య సాధనకు నిరంతర సాధన చేస్తుంటారు. ఉత్తమ క్రీడాకారులుగా రాణించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని హాకీ క్రీడాకారులు పేర్కొన్నారు. జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున క్రీడాకారులు పలు ఈవెంట్లలో పాల్గొన్నారు. ప్రధానంగా ఆర్చరీ, బాస్కెట్ బాల్, అథ్లెటిక్సు, బ్యాడ్మింటన్, బాక్సింగ్, హాకీ, కబాడీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ నందు పోటీలు నిర్వహిస్తున్నారు. ఆయా పోటీలను సుమారుగా 400మంది క్రీడాకారులు హాజరవ్వగా వారి నుంచి 235 మంది క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. తణుకు బాలురున్నత పాఠశాల గ్రౌండులో జరిగిన హాకీ ఆడుతున్న పలువురు క్రీడాకారులు ఆయా రంగాల్లో ఉత్తమ క్రీడాకారులుగా రాణించడంతో పాటు, క్రీడల ద్వారా మంచి ఉపాధి, ఉద్యోగాల సాధన తమ ముందున్న లక్ష్యాలని తమ మనస్సులో ఉన్న ఆలోచనను తెలిపారు. భవిష్యత్‌లో ఏమి సాధించాలనుకుంటున్నారో... ఇప్పటికి వరకు సాధించిన పతకాలు వివరాలు తెలిపారు.

సైనికుడిగా సేవలందిస్తా



భవిష్యత్‌లో సైనికుడిగా ఉద్యోగంలో చేరి.. దేశానికి సేవ చేయాలని కోరిక. భీమవరం ఆదిత్య కాలేజిలో ఇంటర్ చదువుతున్నా. ఇప్పటివరకు అండర్-17 హరియాణాలో ఆడాను. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడమే లక్ష్యం.

- ఎ.జగదీష్, శృంగవృక్షం, పాలకోడేరు మండలం

జాతీయస్థాయి హాకీ జట్టులో ఆడతా



జాతీయస్థాయి హాకీ పోటీలకు ఇండియా జట్టులో ఆడాలని కోరిక. ఇప్పటివరకు చెన్నై, ధర్మవరం, నెల్లూరు, అనంతపురం, కడప జిల్లాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఎనిమిదేళ్ల నుంచి హాకీ ఆడుతున్నా. భీమవరంలో ని కేజీఆర్‌ఎల్ డిగ్రీ కాలేజిలో చివరి సంవత్సరం చదువుతున్నా.

- ఎం.ప్రదీప్ కుమార్ గొరగనమూడి, పాలకోడేరు మండలం

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..



భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జట్టులో ఆడాలని లక్ష్యం. ఇప్పటి వరకు భువనేశ్వర్, నెల్లూరు. చెన్నై, జలంధర్, గూడూరు, నక్కపల్లి, ఏలూరు. భీమవరం, ఖేలో ఇండియాలో బ్రాంజ్ మెడిల్ సాధించా.

- కె.పార్థసాయి, శృంగవృక్షం పాలకోడేరు మండలం

పోలీస్ ఉద్యోగమే లక్ష్యం



భవిష్యత్‌లో పోలీస్ ఉద్యోగం చేయడం లక్ష్యం. భీమవరం కాలేజీలో ఇంటర్ చదువుతున్నా. ఇప్పటివరకు ఒడిశాలోని సబ్ జూనియర్స్, చెన్నైలో సౌత్ జోన్‌లో బ్రాంజ్ మెడల్, మధ్యప్రదేశ్‌లో అండర్-17 హాకీ పోటీలలో పాల్గొన్నాను. పోలీస్ ఉద్యోగం చేస్తూ ప్రజలకు సేవలందిస్తా.

- పి.శరత్ పవన్‌సాయి, శృంగవృక్షం, పాలకోడేరు మండలం

పోలీసు అధికారిగా స్థిరపడతా..



భవిష్యత్‌లో పోలీసు అధికారిగా స్థిరపడాలని భావిస్తున్నా. భీమవరం ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నా. ఇప్పటివరకు కేరళ, చెన్నై, కర్నూలు, నెల్లూరులో రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొన్నా. కర్నూలులో జరిగిన సబ్ జూనియర్స్‌లో తృతీయ స్థానం, నెల్లూరులో అండర్-17లో తృతీయ స్థానం, విశాఖపట్టణం, యలమంచిలి, కడప, ఏలూరు జిల్లాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నా.

- డి.సంతోష్‌కుమార్, శృంగవృక్షం.

ఆరోగ్య సహాయకులను ఆదుకోండి

ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్



భీమవరంటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య సహాయకులను ఉద్యోగాల నుంచి తొలగించి తొమ్మిది నెలలైంది. ఈ నవమాసాలూ కష్టాలను, కన్నీళ్లనూ తమ కడుపులోనే దాచుకుని అష్ట కష్టాలతో బతుకీడుస్తున్న తమను కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ కూటమి నేతలకు కన్నీటి లేఖలు రాశారు. వివరాలివి.. భీమవరంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత డిసెంబరు 5న తొలగించిన రాష్ట్రంలోని 920మంది ఆరోగ్యసహాయకుల కుటుంబాల దయనీయ పరిస్థితిని వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడుకి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు మొత్తంగా కూటమి ప్రభుత్వ నేతలకు లేఖలు రాశానని వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తూ వాటిని కోల్పోయిన వారంతా యాభై ఏళ్ల వయస్సు పైబడ్డ వారేనని, ఈ వయస్సులో ఏళ్ల తరబడి నమ్ముకుని చేస్తున్న ఉద్యోగం పోతే వారి మీద ఆధారపడ్డ కుటుంబాలు, వృద్ధులైన తల్లిదండ్రులు గత ఎనిమిది నెలలుగా చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇదే వేదనతో రాష్ట్రంలో ఇప్పటికే పది మంది ఆరోగ్యసహాయకుల గుండెలాగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా కలుగజేసుకుని, సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆరోగ్యసహాయకుల ఖాళీల వివరాలన్నింటినీ ప్రభుత్వం కోర్టుకు సమర్పించడమే కాకుండా మెరిట్ ఆధారంగా న్యాయబద్ధంగా అందరినీ తిరిగి నియామకం చేయాలని, అందరికీ పునర్జన్మను కల్పించాలని కన్నీటితో అభ్యర్థించారు.

18 నుంచి బ్యూటీపార్లర్ కోర్సుపై ఉచిత శిక్షణ

పెదపాడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులకు బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు వట్లూరులోని టీటీడీసీ సత్రంపాడు పక్కన గల యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. 18-45 ఏళ్ల వయస్సు గల యువతులు అర్హులని, శిక్షణ కాలం 31 రోజులు ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి అందించబడుతుందన్నారు. ఆసక్తిగల వారు సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 95027 23561, 90140 40780 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రతి ఆదివారం మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ప్రతీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు హనుమద్ హోమం నిర్వహిస్తామని, హోమంలో పాల్గొన్న దంపతులకు ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం అవకాశం కల్పిస్తామని ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. శనివారం వేకువఝాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేక సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంపై స్వామి వారి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శనివారం పలు సేవల రూపంలో ఆలయానికి రూ.1,41,469 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.



శ్రీవారి ఆలయ ప్రాంగణంలో టోల్‌గేట్.. (ఇన్‌సెట్‌లో) ద్విచక్రవాహనదారుల నుంచి వసూలు చేసి రుసుం టిక్కెట్టు

టోల్ రుసుం పెంచి వసూళ్లు

» శ్రీవారి భక్తులపై అధిక భారం

నిబంధనలకు విరుద్ధంగా రెట్టింపు రేట్లు వసూలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో టోల్ గేట్ పాటదారులు దేవస్థానం నియమ నిబంధనలను తుంగలోకి తొక్కి అధిక ధరలకు టోల్ రుసుంను వసూలు చేస్తూ భక్తుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం సూచించిన రేట్లకు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఈమేరకు అటువైపు సంచరించే భక్తులు లబోదిబోమంటున్నారు. ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చే భక్తుల నుంచి టోల్ రుసుం వసూలు చేసే హక్కును దేవస్థానం గతేడాది బహిరంగ వేలంపాట నిర్వహించింది. రెండేళ్ల కాలానికి జరిగిన ఈ పాటలో పాటదారుడు తాము పేర్కొన్న రీతిలో టోల్ వసూలు చేయడంతో పాటు మొదటి ఏడాది జీఎస్‌టీతో కలిపి రూ.1.60 కోట్లు, రెండో ఏడాది జీఎస్‌టీతో కలిపి రూ.1.80కోట్లు పాటదారుడు చెల్లించాల్సి ఉంది. అయితే శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దిచక్ర వాహనదారులనుంచి రెట్టింపు రేట్లు వసూలు చేసినట్టు తెలిసింది. ద్విచక్రవాహనాలకు గాను దేవస్థానం రేటు ప్రకారం రూ.10 వసూలు చేయాల్సి ఉండగా రూ.20 వసూలు చేసినట్టు సమాచారం. దేవస్థానం అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, పాటదారుడు నిర్ణీత రేట్ల ప్రకారం వసూళ్లు జరిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

రూ.20 వసూలు చేశారు..



శ్రీవారి దర్శనం నిమిత్తం ద్వారకా తిరుమలకు బైక్‌పై వచ్చా. నా దగ్గర రూ.20 టోల్‌గేట్ కోసం అంటూ వసూలు చేశారు.. ఆ తరువాత తెలిసింది. రూ.10 మాత్రమే వసూలు చేయాలని.. ఏమిటని అడిగితే రేట్లు దేవస్థానం వారు పెంచారు.. అందుకే ఈవిధం వసూలు చేస్తున్నామని చెప్పారు.

- వీరభద్రరావు, నూజివీడు, ఏలూరు జిల్లా.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

- » జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి
- » పోలీస్ క్రికెట్ లీగ్ ప్రారంభం
- » తొలి మ్యాచ్‌ను బ్యాటింగ్ చేసి ప్రారంభించిన ఎస్పీ



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భీమవరం డీఎన్నార్ కళాశాల క్రికెట్ క్రీడా మైదానంలో రెండు రోజులపాటు జరగనున్న పోలీస్ క్రికెట్ లీగ్‌ను శనివారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రారంభించారు. క్రికెట్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలను నిర్వహించి పోలీసు సిబ్బందికి విధి నిర్వహణలో ఉండే ఒత్తిళ్లను తగ్గించి, జట్టు స్ఫూర్తిని, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు, విభాగాల నుంచి పలు టీంలు పాల్గొన్నాయి. ప్రధానంగా క్రికెట్‌లో ఎస్పీ ఎలెవెన్ టీం, నరసాపురం ఎలెవన్ టీం, భీమవరం ఎలెవన్ టీం, తాడేపల్లిగూడెం ఎలెవన్ టీం అనే పేర్లతో ఏర్పడిన నాలుగు ప్రధాన టీంలు తలపడనున్నాయి. టోర్నమెంట్‌లో మొదటి మ్యాచ్‌ను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా పోలీసు అధికారుల సమక్షంలో బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఈ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీసు సిబ్బందికి ఉండే తీవ్ర ఒత్తిడిని తగ్గించడంలో క్రీడలు ఒక ఉత్తమ సాధనమన్నారు. ఈ పోటీల ద్వారా సిబ్బంది కేవలం శారీరక ఆరోగ్యమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని కూడా పొందుతారన్నారు. ఇది వారిలో జట్టు స్ఫూర్తిని, క్రమశిక్షణను, సత్సంబంధాలను పెంపొందిస్తుందని, ఇది ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కూడా ఉపకరిస్తుందని అన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేశారు. భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.జయసూర్య, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ డి.విశ్వనాథ్, కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి. ఏలూరు జిల్లాలో 9 క్రీడాంశాల్లో అండర్-22 పురుషులు, మహిళల జట్లకు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లను జోనల్ పోటీలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ రాణించే క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ నెల 11న జంగారెడ్డిగూడెంలో ఆర్చరీ, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్, ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల్లో బ్యాడ్మింటన్, ఏలూరు కండ్రికగూడెం బాక్సిట ఫిట్ బాక్సింగ్ అకాడమీలో బాక్సింగ్ పోటీలు, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, కోకో, వాలీబాల్, ఏలూరు ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. 13న అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయి. మరింత సమాచారానికి ఫోన్ నంబరు 98663 17326లో సంప్రదించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు.



శ్రీవారి క్షేత్రంపై డ్రోన్ కలకలం

పట్టించుకోని భద్రతా విభాగం

ద్వారకాతిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయ ప్రధాన రాజగోపురంపై డ్రోన్ కెమెరా ఎగరడం కలకలం రేపింది. ఆలయ భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్ కెమెరాలు ఆలయంపై ఎగుర వేయడాన్ని ఆలయ అధికారులు నిషేధించారు. అయితే శనివారం రాత్రి డ్రోన్ ఎగురుతున్నా భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం వివాదాస్పదమైంది.

ఉత్సాహంగా.. సింగర్ ఫెస్ట్

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సాహితీ సాంస్కృతిక సేవలో శ్రీశ్రీ కళావేదిక ముందంజలో ఉంటుందని కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక మహాలక్ష్మీ కల్యాణ మండపంలో సింగర్ ఫెస్ట్ పేరిట భారీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి టి. పార్థసారథి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 120 మంది వివిధ రాష్ట్రాలకు చెందిన గాయకులు పాల్గొన్నారు. నాన్‌స్టాప్ ట్రాక్ సింగింగ్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులకు స్వర కిరీటి బిరుదులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక నిరంతరం కవులు, కళాకారుల ప్రోత్సాహానికి కృషి చేస్తుందని, ఒకే వేదికపై ఇంత మంది సింగర్లు కలవడం ఇదే ప్రథమమని ఇదొక వరల్డ్ రికార్డు అని అన్నారు. వచ్చే నెలలో



మాట్లాడుతున్న కత్తిమండ ప్రతాప్

పలనాడు జిల్లా నరసరావుపేటలో తెలుగు భాషా పురస్కారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సీపల్లి హారిక, శ్రీశ్రీకళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, శ్యామల, శాంతిభాయి, బాలాజీ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండలో చండీహోమం

పెనుగొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పెనుగొండలో నగరేశ్వర, మహిషాసురమర్దిని, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం ఆలయ అర్చకుడు పి. సత్యనారాయణ చండీహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో దాసిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుర్గమ్మకు ఎమ్మెల్యే బొలిశెట్టి పూజలు



తాడేపల్లిగూడెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దంపతులు శనివారం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామిని, దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే దంపతులకు అధికారులు స్వాగతం పలికి దగ్గరుండి పూజలు జరిపించారు.

ఆక్వా మందుల దుకాణంలో అగ్ని ప్రమాదం



కైకలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆక్వా మందుల దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి కైకలూరు నీలం సంజీవరెడ్డి వారపు సంతలో వాసవి ఆక్వా మందుల దుకాణంలో హైడ్రోజన్ పెరాక్సైడ్ లీక్ అయి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదాన్ని త్వరితగతిన గుర్తించడంతో భారీ నష్టం వాటిల్లకుండా అదుపు చేశారు.

గంజాయి వలలో యువకులు

విశాఖ నుంచి తీసుకొచ్చి యువకులకు విక్రయాలు - కూపీలాగిన కైకలూరు పోలీసులు

ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరి అరెస్టు - 2.5 కేజీల గంజాయి స్వాధీనం

కైకలూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుకు అలవాటు పడటంతో పాటు విక్రయాలు జరుపుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 2.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు కైకలూరు రూరల్ సీఐ వి.రవి కుమార్ తెలిపారు. శనివారం కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం కైకలూరు మండలం ఆలపాడు కోఆపరేటివ్ బ్యాంకు వద్ద రూరల్ ఎస్.ఐ. వి. రాంబాబు వాహనాలు తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీల్లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో విచారణ చేపట్టారు. గంజాయి మత్తులో ఉండడంతో పాటు వారి వద్ద ఉన్న 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరు కైకలూరు మండలం సింగాపురం గ్రామానికి చెందిన గురువెల్లి బాలసాయిరామిరెడ్డి, చటాకాయ గ్రామానికి చెందిన జయమంగళ లక్ష్మీనారాయణ, కైకలూరు టౌన్‌కు చెందిన నరహరశెట్టి వెంకట అవినాష్‌లుగా గుర్తించారు. వీరిలో రామిరెడ్డి 2015-18వరకు విశాఖలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును విద్యనభ్యసించాడు. ఆ సమయంలో గంజాయి మత్తుకు అలవాటుపడినట్టు తెలిపారు. విద్య పూర్తి చేసిన తరువాత హైదరాబాద్, విజయవాడ, మలేషియాలో ఉద్యోగం చేశాడు. ఆ సమయంలో గంజాయికి అలవాటు పడటంతోపాటు ఇటీవల స్వగ్రామానికి వచ్చి ఆకివీడులోని తన స్నేహితుడికి విక్రయించాడు. గంజాయి కేసులో ఆకివీడుకు చెందిన అతడి స్నేహితుడిని 10 రోజుల క్రితమే పోలీసులు అరెస్టు చేశారు. రామిరెడ్డి విశాఖ జిల్లా లాకవరం గ్రామం నుంచి గంజాయిని తీసుకొచ్చి గంజాయిని లక్ష్మీనారాయణ, అవినాష్‌లతో కలిసి కైకలూరు పరిసర ప్రాంతాల్లోని యువకులకు విక్రయిస్తున్నాడు. వీరి నుంచి గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.గంజాయి కేసులో పట్టుబడితే 21 ఏళ్ల శిక్షపడే అవకాశం ఉంటుందని, ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే 112, 1972 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. వీరి ముగ్గురిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సీఐ వెల్లడించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్



గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. దొరికిన గణేశ్ మృతదేహం

నల్లీ క్రీక్‌లో దిగి విద్యార్థి మృతి



విద్యార్థి గణేశ్ మృతదేహం

నరసాపురంరూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చినలంక బీచ్‌లో స్నేహితులతో సరదాగా గడిపి ఇంటికి తిరిగివస్తూ కాళ్లకు అంటిన మట్టిని కడుక్కునేందుకు ఇంజనీరింగ్ విద్యార్థి గట్టం గణేశ్(20) నల్లీక్రీక్‌లో దిగి గల్లంతయ్యాడు. నరసాపురం మండలం చినలంకలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన గట్టం గణేష్ ముగ్గురు మిత్రులతో కలిసి చినలంక బీచ్‌కు వెళ్లాడు. అక్కడ సరదాగా గడిపి బైక్‌లపై తిరుగుముఖం పట్టారు. ఈక్రమంలో కాళ్లు కడుకునేందుకు క్రీక్‌లో దిగాడు. మిగిలిన స్నేహితులంతా ఒడ్డునే ఉన్నారు. ఆ సమయంలో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గణేష్ గమనించలేక పోయాడు. నీళ్లలోకి దిగిన వెంటనే కాలు జారి లోపలికి పడటంతో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కేకలు విని స్నేహితులు గుర్తించారు. అదే సమయంలో మత్స్యకారులు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో గ్రామానికి వెళ్లి ఈత వచ్చే వారిని తీసుకొచ్చేలోపు గణేష్ ఆచూకి చిక్కలేదు. పడవలతో గాలించినా... ఆచూకీ చిక్కలేదు. శనివారం సాయంత్రానికి గణేష్ గల్లంతైన ప్రదేశానికి కొద్ది దూరంలో తూములో చిక్కుకుని చనిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, సర్పంచ్ ఒడుగు ఏసులు జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు మైలా వసంతరావులు సంఘటన ప్రదేశానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. గణేష్ స్వర్ణాంధ్ర కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఆమె తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. వెంకట సురేష్ తెలిపారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

కాళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కలువపూడి గ్రామంలోని పంట కాలువలో అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతదేహం లభించింది. కలవపూడికి చెందిన గొట్టుముక్కల సత్యవతి(75) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. పిల్లల వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంటిలోని గదిలో పడుకున్న ఆమె తెల్లారేసరికి లేకపోవడంతో, చుట్టుపక్కల గాలించగా పంట కాలువలో శవమై కనిపించడంతో కుమారుడు వెంకట రామరాజు ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



జాషువా(ఫైల్)

ఏలూరు క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు మరలా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు తూర్పువీధి ఫిల్ హౌస్‌పేటకు చెందిన విశ్వనాథపల్లి జాషువా(56) కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఇతనికి మతిస్థిమితం సరిగాలేక శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో గాలించినా అతని ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

తణుకు రూరల్, అగస్టు 9(ఆంధ్రజ్యోతి): పైడిపర్రులో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం దువ్వ గ్రామానికి చెందిన యార్లగడ్డ రవి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా తణుకు నుంచి ఫ్లైఓవర్ మీదుగా పైడిపర్రు వస్తున్న ఏలూరు ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి ఎడమ కాలు నుజ్జునుజ్జయింది. గాయపడిన రవిని మొదట తణుకు ఏరియా ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని మరొకరికి గాయాలు..

ఉండి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న ఘటనలో ఉండి మండలం పాములపర్రు గ్రామానికి చెందిన వజరపు ముసలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం కాళ్ల మండలంలోని బొండాడ అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా వాండ్రం వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముసలయ్య ఎడమ కాలు విరిగిపోయింది. భీమవరంలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బాల్య స్నేహితుడిపై కత్తితో దాడి



ఆస్పత్రిలో ఉన్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్న విషయంలో విభేదాలు రావడంతో బాల్య మిత్రుడు మరోమిత్రుడిపై కత్తితో దాడి చేశాడు. ఏలూరు రూరల్ మండలంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. హనుమాన్‌నగర్‌కు చెందిన కృష్ణ వరపు ఆంజనేయ వర ప్రసాద్ ఏలూరులో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పేరాడ శివాజీ ఇతనికి చిననాటి నుంచి స్నేహితుడు, శనివారం వీరిద్దరి మధ్య చిన్న విషయంపై మాట మాట పెరిగింది. దీతో ఆంజనేయ వర ప్రసాద్‌పై శివాజీ కత్తితో దాడి చేశాడు. గమనించిన ప్రసాద్ బంధువులు వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రసాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

విద్యుదాఘాతానికి విద్యార్థి బలి

ముదినేపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి ఓ విద్యార్థి బలయ్యాడు. స్థానిక జడ్పీ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న మెండెల అంజయ్య, తిరుపతమ్మ కుమారుడు మెండెల ఏసురాజు(13) శనివారం సాయంత్రం మోటార్ స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. కుమారుడి మరణంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

కారు ఢీకొని మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఏలూరు క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ నగర శివారు జాతీయ రహదారి దుగ్గిరాల బ్రిడడ్జి సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టి.నరసాపురం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఈదర రవి(56)గా అతడిని గుర్తించారు. కొంతకాలంగా రవి ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆశ్రం వైపు వెళ్తుండగా ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఢీకొన్న కారు ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సీఐ తెలిపారు.

నేరస్థులు తప్పించుకోకుండా చూడాలి

» కోర్టు మోనటరింగ్ సభ్యులకు ఏఎస్పీ దిశానిర్దేశం

ఏలూరు క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ముద్దాయిలకు త్వరితగతిన శిక్ష పడేలా కోర్టు మోనటరింగ్ సభ్యులు సమర్థవంతంగా పనిచేయాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేఈఎస్ కిషోర్ ఆదేశాలతో జిల్లా ఏఎస్పీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు మోనటరింగ్ సెల్, పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్‌లకు చెందిన కోర్టు మోనటరింగ్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణ వేగంగా జరగాలంటే కోర్టులో సాక్ష్యులను సమయానికి హాజరుపరచాలన్నారు. నేరస్థులు శిక్షల నుంచి తప్పించుకోకూడదని బాధితులకు సత్వర న్యాయం జరగాలన్నారు. ప్రతిరోజు కోర్టుల్లో జరిగే ప్రక్రియను డాక్యుమెంటేషన్ చేసి స్టేషన్ అధికారికి నివేదించాలన్నారు. కోర్టు మోనటరింగ్ సెల్ ఇన్‌చార్జి సీఐ ఎం.సుబ్బారావు, సంబంధిత కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

17న వివాహ పరిచయ వేదిక

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాల కోసం 17వ తేదీన వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు కె.టి.బి.ఓ అసోసియేషన్ అధ్యక్షుడు జెట్టి సింహాద్రిరావు తెలిపారు. ఏలూరులోని పడమర వీధి గాంధీ మైదానంలోని అసోసియేషన్ భవనంలో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పరిచయ వేదిక ప్రారంభం అవుతుందని, తల్లిదండ్రులు వారి వధూవరుల బయోడేటా, ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు.

ఉచితంగా ఆయుర్వేద మందుల పంపిణీ

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకోటి ప్రాంగణంలో మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బీవీఎం నగేష్ బృందం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారందరికీ ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సమస్యలపై సలహాలు, సూచనలు అందజేశారు. మానేపల్లి రామారావు, బొలిశెట్టి సురేష్‌కుమార్, లోకేష్, పిల్లి ఫండరీనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏపీటీఎఫ్ జిల్లా శాఖ సమావేశం

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ జిల్లా శాఖ సబ్ కమిటీ సమావేశం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొజిషన్ ఐడీలు ఇంకా కొంత మందికి రావలిసినందున బిల్ సబ్మిషన్‌కు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పెంచాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డి దొర మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేసిన మూల్యాంకన పుస్తకాల వలన విద్యార్థికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఉపాధ్యక్షులు బి.శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలన్నారు. ఉపాధ్యక్షుడు ఎస్.దొరబాబు, కమిటీ సభ్యులు ఎస్.కె.రంగావలి, వి.శ్రీనివాస్, కె.కుటుంబరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు శ్రీనివాస్

పంటకు గిట్టు బాట ధర కల్పించాలి : రైతు సంఘం

జీలుగుమిల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. జీలుగుమిల్లిలో ఏపీ రైతు సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. రైతు సంఘం జెండా ఆవిష్కరించారు. పొగాకు, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి, వరి పంటలు పండించిన రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ఇస్తేనే వ్యవసాయానికి మనుగడ ఉంటుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి మెట్టప్రాంత రైతులకు సాగు నీరందించాలని డిమాండ్ చేశారు.ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సి.హెచ్.సీతారామయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి సి.హెచ్. కొండలరావు, కారం నాగదుర్గ, సుంకవల్లి శేషగిరారావు, బొంతు వెంకటేశ్వరరావు, టి.సూర్యారావు, డి.రామారావు, ఎం.ప్రభాకరావు ఉన్నారు.


హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

గీత కార్మికులకు రాయితీపై బీసీల హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించడంతో పాటు లైసెన్స్ ఫీజులో రాయితీ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల టీడీపీ బీసీ సాధికారత సమితి రాష్ట్ర అధ్యక్షుడు పట్నాల వెంటేశ్‌బాబు, రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, ఇడా చైర్మన్ పెద్దిపోయిన శివప్రసాద్ హర్షం ప్రకటించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు సీఎం చంద్రబాబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నాయకులు రుప్పా రాంబాబు, టి.రవి, వీరంకి త్రినాథ్, పి ప్రసాద్ బాబు, బాలాజీ, సురేష్ పాల్గొన్నారు.

మన్నాచర్చిలో ముగిసిన ఉపవాస ప్రార్థనలు

ఏలూరుటూటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శాంతినగర్‌లోని మన్నాచర్చిలో 40 రోజుల పాటు నిర్వహించిన ఉపవాస ప్రార్థనలు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి దేవుని సేవకుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. క్రైస్తవ సోదరులందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్అండ్ఆర్ నాగేశ్వరరావు, నన్నపనేని సురేశ్, బిషప్ ఎం.ఎలీషారాజు,సీనియర్ పాస్టర్ జ్యోతిరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


బస్టాండ్ వద్ద ప్రయాణికుల రద్దీ

వరుస సెలవులతో బస్సులు కిటకిట

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో మూడ్రోజులు వరుసగా సెలవులు రావడంతో ప్రజలు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు మధ్య భాగంలో జంగారెడ్డిగూడెం పట్టణం ఉండటం, ప్రధాన ఆలయాలైన మద్ది ఆంజనేయుని దేవస్థానం, గోకుల తిరుమల పారిజాత గిరి దేవస్థానాల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శనివారం రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని కూడా అధికంగా ప్రయాణాలు కొనసాగించారు. దీంతో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిక్కిరిసింది.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీదేవి భూదేవి సమేత సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిది శనివారాల మొక్కుబడుల నేపథ్యంలో మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నట్టు ఆలయ అర్చకులు వెంకట్రామశర్మ తెలిపారు.

జాతీయ రహదారిపై పశువుల సంచారం

ఉంగుటూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కైకరంలో గత పదిహేను రోజుల నుంచి జాతీయ రహదారి వెంబడి ఒక ఆబోతు, రెండు ఆవులు తిరుగాడుతున్నాయి. అయితే ఇవి ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదు. కాగా ఎక్కడి రైతుకు చెందిన ఈ పశువులో దారి తప్పి వచ్చాయేమోనని స్థానికులు ఆరా తీసినా ఇంత వరకు ఆచూకీ కోసం ఎవ్వరూ రాకపోవడం గమనార్హం. దీనిపై సంబంధిత రైతులు తమ పశువులను తోలుకెళ్తారని ఆశిద్దాం. వేలాది రూపాయల విలువైన ఈ ఆవు దూడను వదలి వేయడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.రాత్రి పూట రహదారి మధ్యలో విశ్రాంతి తీసుకుంటున్నాయి.

అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పాలన



దెందులూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అవినీతికి అవకాశం లేకుండా ఆభివృద్ధి, సంక్షేమాలకు చిరునామాగా కూటమి ప్రభుత్వం సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పని చేస్తున్నారని దెందులూరు నియోజకవర్గ జనసేన నాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మీ దంపతులు అన్నారు. ఇటీవల వేగివాడ గొల్లగూడెం చెందిన జనసేన కార్యకర్త గురజా వెంకన్నబాబు ప్రమాదానికి గురైన నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఆదేశాలతో పరమర్శించారు. బాధిత జనసేన కార్యకర్త వెంకన్నబాబుకు రూ.30 వేల నగదును అందించడంతో పాటు ప్రతి నెలా రూ.5 వేల రూపాయలను అందిస్తామని తెలిపారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన భర్తను, కొడుకు కోల్పోయిన ఒంటరి మహిళ దుడ్డి మణేమ్మకు రూ.5 వేలు తక్షణ సహాయం కింద అందించారు.

ప్లాస్టిక్‌పై పోరు

(5వ పేజీ తరువాయి)

వినియోగించకూడదు. ఆలయాల పరిధిలో వ్యాపారస్థులకు ప్లాస్టిక్ నిషేధం అమలుపై నోటీసులు జారీచేయాలి. వ్యాపారులతో సమావేశాలు జరిపి కమిషనర్ ఉత్తర్వులపై స్పష్టత ఇవ్వాలి. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలపాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వలంటీర్లు, సిబ్బందితో అప్రమత్తం చేయాలి. ఆలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా.. ప్లాస్టిక్ వాడకం నిషేధంపై తాము తీసుకున్న చర్యలను సూచిస్తూ ప్రతీనెలా కమిషనర్ కార్యాలయానికి ఆలయ అధికారులు నివేదికలను పంపాలి.


రాఖీకట్టడానికి వచ్చిన మహిళలతో ఎమ్మెల్యే చంటి


ఎమ్మెల్యే చింతమనేనికి రాఖీ కడుతున్న మహిళ


మాజీ సైనికులకు రాఖీలు కట్టిన బీజేపీ మహిళలు

ఇంటింటా రాఖీ పండుగ సందడి

ఏలూరు రూరల్, ఆగస్టు 9, (ఆంధ్రజ్యోతి) : సోదరీమణులు, సోదరుల మధ్య ప్రేమానురాఘాలకు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు మండలంలోని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వయస్సు తారతమ్యం లేకుండా అతా ఈవేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటా రాఖీ పండుగ సందడి నెలకొంది. సుదూర ప్రాంతాలలో ఉన్న సోదరీమణులు పుట్టిళ్ళకు వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీ పౌర్ణమి, ఫ్యాన్సీ షాపులు, స్వీట్స్ స్టాల్స్, పండ్లు, దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. ఈసందర్భంగా రాఖీ బంధన్ విశిష్టతను వివరించి అన్నదమ్ములు, అక్క చెల్లెల్లు ప్రేమానురాగాలు చాటారు.

● ఏలూరు: లింగపాలెం మండల వ్యాప్తంగా అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతిరూపమైన రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మెట్టినింటికి వెళ్లిన అక్కాచెల్లెళ్లు పుట్టింటికి వచ్చి తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు. రాఖీలు కట్టిన తోబుట్టువులకు కానుకలను అందించారు.

● ఏలూరుటూటౌన్: వెలకట్టలేని అనుబంధాలను గుర్తు చేసే మధురానుబంధమే రక్షాబంధన్ అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. నియోజకవర్గంలోని పలువురు మహిళలు ఎమ్మెల్యే చంటికి రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అక్కచెల్లెళ్లకు జీవితాంతం తోడుగా ఉంటానని భరోసా కల్పించారు. అక్కాచెల్లెళ్లందరికీ ఎమ్మెల్యే కేకులతో పాటు స్వీట్లు పంచారు.

● చింతలపూడి: రక్షాబంధన్ వేడుకలు మండలంలో సంప్రదాయబద్ధంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు మాజీ జడ్పీటీసీ టి.రాధారాణి రాఖీ కట్టి అభినందనలు పంచుకున్నారు. నాలుగు మండలాల నుంచి మహిళలు క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టారు. రక్షాబంధన్ కారణంగా మార్కెట్‌లో స్వీట్ హోంలు, పూల దుకాణాలు, బట్టల దుకాణాలు కిటకిటలాడాయి.

● ఉంగుటూరు: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం నారాయణపురం పంచాయతీ కార్యాలయంలో మాజీ సైనికులకు సర్పంచ్ దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో రాఖీలు కట్టి వేడుకలు నిర్వహించారు.పలువురు మాజీ సైనికులతో పాటు విశ్రాంత సైనికుడు దిడ్ల శ్రీను తదితరులకు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, అడపా శోభారాణి రాఖీలు కట్టారు.

● జంగారెడ్డిగూడెం: ఓ ప్రైవేటు బ్యాంకులో సెక్యూరిటీ ఉద్యోగం చేస్తున్న జి.రామాంజనేయులుకు తన ఎనిమిది మంది సోదరీమణులు రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. తోబుట్టువులు ఇద్దరు, పిన్ని కుమార్తెలైన మరో ఆరుగురు కలిసి రామాంజనేయులుకు రాఖీలు కట్టి తమ ప్రేమను కనబరిచారు. ప్రతీ రాఖీ పండుగ రోజున తన ఎనిమిది మంది సోదరీలు తన ఇంటికి వస్తారని, తనతో ఎంతో ప్రేమగా ఉంటారని రామాంజనేయులు తెలిపారు. గత ఏడాది రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు తన సోదరీమణుల పూజలే తనను కాపాడాయన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

ఆదివాసీ దినోత్సవంలో నాయకుల పిలుపు

చింతలపూడి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నాయకపోడుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎర్రగుంటపల్లిలో నాయకపోడులు ఉత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించారు. ఆదివాసీల జెండాను ఆయన ఆవిష్కరించారు. నాయకపోడ రాష్ట్ర అధ్యక్షులు అప్పిరెడ్డి నాగు మాట్లాడుతూ నాయకపోడు కులస్థులకు సంబంధించిన విషయాలను, సమస్యలపై మాట్లాడారు. నాయకులు లక్ష్మీనా రాయణ, నారం రాజా, బి.హనుమంతరావు, ఎస్.బుచ్చి రాజు, పూసి వెంకటలక్ష్మి, మేడి రాములు, దమ్మపేట మండల మార్కెట్ యార్డు చైర్మన్ దాసం రాణి, మాజీ జడ్పీటీసీ టి.రాధారాణి, అప్పిరెడ్డి రాము పాల్గొన్నారు.

● వేలేరుపాడు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని వేలేరుపాడులో పలు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మినీస్టేడియం నుంచి వందలాది మందితో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలు సాంప్రదాయ వాయిద్యాలతో కళాకారుల నృత్యాలతో కోలాహలంగా నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ మండల అధ్యక్షుడు చోడే సీతారామయ్య, రాజు, వెంకటేష్, సూర్యచంద్రం, ముత్యాలరావు, మోహన్‌దొర, రామలక్ష్మి పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఆదివాసీలంతా ఐక్యంగా సమస్యలపై ఉద్యమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ఆదివాసి సంక్షేమ పరిషత్, పలుపార్టీల అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో ఆదివాసీ సాంప్రదాయ వాయిద్యాలతో, ఆదివాసి కళాకార నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు కూరం సంజీవ రావు, వేణుగోపాల్, పి.సీతారామయ్య, సరియం ప్రసాదరావు, పైడా పరమేశ్వరరావు, మచ్చా ప్రశాంత్, మచ్చా సుభద్ర, చోడే రామయ్య, చోడే సందీప్, పలు పార్టీ నాయకులు ములిశెట్టి నాగేశ్వరరావు, ఎం.యుగంధర్, ఎస్.కె.గౌస్, కొన్నే లక్ష్మయ్య పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఆదివాసీ ప్రాంతాల్లో కార్పొరేట్ పెట్టుబడిదారుల పెత్తనాన్ని నియంత్రించి ఆదివాసీ గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఏబీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బుట్టాయగూడెంలో ఏబీకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. సభలో పి.శ్రీనివాస్, వి.సుబ్బన్న, ఎస్.రామ్మోహన్, టి.బాబూరావు, జి.ప్రసాద్, కె.పోతురెడ్డి, యు.ఏసుబాబు మాట్లాడగా ఈ.భూషణం, బి.వినోద్, కారం లక్ష్మీ, కె.గంగరాజు, ఎం.శ్రీరాములు, కె.ముక్కారెడ్డి, వి.వెంకటేశ్వరావు, కె.రాముడు, కె.శిరమయ్య పాల్గొన్నారు.

● పోలవరం: మానవ నాగరికతకు ఆదివాసీలే పునాదులని ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పోలవరం మండలం ఎల్.ఎం.డి.పేట గ్రామంలో కోండ్రుకోట పునరావాస కాలనీలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న ఆయన ఆదివాసీ పతాకావిష్కరణ చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ రామన్నపాలెంలో కలుం వెంకటేశ్వరరావు నాయకత్వంలో జరిగిన ఆదివాసీ దినోత్సవంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు పోరాడాలన్నారు. కోండ్రుకోట సర్పంచ్ పైదా నాగరాజు, గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు, ఎస్.మోహన్, బుచ్చిబాబు పాల్గొన్నారు.


కుక్కునూరులో జెండా ఎగురవేసిన ఆదివాసీ నాయకులు

● టి.నర్సాపురం: మండలంలోని కొల్లివారిగూడెం, మర్రిగూడెం, సున్నపురాళ్లపల్లి గ్రామాల్లో ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారంరాజు, ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. ఆదివాసీ సంఘం మండలాధ్యక్షుడు బుచ్చిరాజు,నల్లగొల్ల బాలరాజు, రెడ్డి శ్రీనివాసులు, కొండా రాము, రాజులు, దుర్గారావు, కనకయ్య, జ్యోతక్క, రాదక్క, సంగం బుచ్చిరాజు, అల్లం జగదీశ్, పోలయ్య పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: గిరిజన తండాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని ఎస్టీ గిరిజన బంజార, సుగాలి, లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూక్యా నాగేశ్వరరావు నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ కార్యాలయంలో ప్రపంచ గిరిజన దినోత్సవం జిల్లా అధ్యక్షులు కృష్ణ అధ్యక్షతన జరిగింది. కోశాధికారి బాలాజీ నాయక్, బి.రంగానాయక్ పాల్గొన్నారు.


ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ట్రాఫిక్ క్రమబద్ధీకరించిన ఎమ్మెల్యే

దెందులూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు బ్రిడ్జి వద్ద జోరు వానలోనూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనదారులకు సూచనలు చేశారు. వర్షం కారణంగా గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి బైక్‌లు, కార్లు, లారీలు, వ్యాన్‌ల డ్రైవర్లు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం గమనించిన ఎమ్మెల్యే చింతమనేని జోరు వానలోనూ రోడ్డు మధ్యలో నిలుచుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భారీ వాహనాలు ఒక పక్కకు, ద్విచక్ర వాహనాలను మరోవైపునకు మరలించి సమస్యకు పరిష్కారం చూపారు. అనంతరం జాతీయ రహదారి అధికారులకు ఫోన్‌లో మాట్లాడి సత్వరమే రోడ్ల మరమ్మతులు చేయించాలని ఆధికారులను ఎమ్మెల్యే చింతమనేని కోరారు.

● ఏలూరు క్రైం: ఏలూరు అమీనాపేట సమీపంలోని శనివారపుపేట లోబ్రిడ్జిలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో అదే సమయంలో ఏలూరు నుంచి దుగ్గిరాల వెళ్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎమ్మెల్యే 10 నిముషాల్లోనే ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

ఇంజనీరింగ్ సెక్షన్ ఉద్యోగుల టూల్స్ డౌన్

ఏలూరురూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిరక్షణలో వహిస్తున్న నిర్లక్ష్య విధానాలకు వ్యతిరేకంగా ఏలూరులో శనివారం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సెక్షన్ ఉద్యోగులు టూల్స్ డౌన్ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్.ఆర్-2 వద్ద టూల్స్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఏలూరు ఏరియా కార్యదర్శి అధికారంలోకి రాకముందు కూటమి పార్టీల నాయకులు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఎన్ఎంఆర్ ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన హామీని అమలు చేయ లేదని వారు ఆరోపించారు. నాయకులు కడుపు కన్నయ్య, నారా శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, గేదెల రవి, సి.హెచ్.అమర్నాథ్, టి.కనకరాజు, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించండి

పోలవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు లేకపోవడంతో మండలంలో పలు ప్రాంతాల నుంచి ప్రసవం కోసం వస్తున్న గర్భిణులు, స్త్రీల సమస్యలతో వస్తున్న రోగులు అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక అక్కడి వైద్యులు గర్భిణులను ప్రసవం కోసం రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫార్సు చేయాల్సి వస్తోంది. ఏడాదిన్నర క్రితం కాంట్రాక్టు పద్ధతిన విష్ణువర్ధిని అనే గైనకాలజిస్టును ఈ ఆసుపత్రిలో విధుల నిర్వహణకు నియమించారు. ఏడాదిన్నరగా ఎలాంటి క్లిష్టమైన ప్రసవ కేసులనైనా ఆమె స్వయంగా ఆపరేషన్లు నిర్వహించి ప్రసవం చేసేవారు. దీంతో పోలవరం పరిసర ప్రాంతాల ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పోలవరం వచ్చేవారు. ఈ ఏడాది మే నెలలో ఏజెన్సీ ప్రాంత గిరిజన గర్భిణీ ప్రసవ సమయంలో పరిస్థితి విషమించి మృతి చెందడంతో విధుల నిర్వహణలో అలసత్వం వహించారని ఆమెపై క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశారు. అంతేగాక గత నాలుగు నెలలుగా ఆమెకు జీతం కూడా ఇవ్వలేదు. నిజానికి సంఘటన జరిగిన రోజు ఆమె విధులలో లేదని ఆమె లేని సమయంలో జరిగిన మృతికి ఆమెను బాధ్యురాలిని చేసి క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం అన్యాయమని, సరికాదని సాటి వైద్యులు చెబుతున్నారు. పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు పోస్టుని తక్షణమే భర్తీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పోలవరంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం

సీఆర్ఆర్‌లో పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుక

పెదపాడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రీ యూనియన్ - 2025 వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. 2000 సంవత్సరంలో ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన వివిధ విభాగాల పూర్వ విద్యార్థులంతా ఇందులో పాల్గొని సందడి చేశారు. జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్, రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మాజీ లైబ్రేరియన్ డి.ఎస్.ఆర్.కె.వి.ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని సిల్వర్‌జూబ్లీ కరపత్రాన్ని ఆవిష్కరించి, పూర్వవిద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పూర్వవిద్యార్థులు అత్యాధునిక సాంకేతిక అంశాలను ఆన్‌లైన్ ద్వారా ప్రస్తుత విద్యార్థులకు బోధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడం సంతోషకరమని, పూర్వ విద్యార్థులు తమవంతు సహకారాన్ని ప్రాజెక్టుల రూపంలో, ఉద్యోగాల ద్వారా అందించాలని తెలిపారు. కళాశాల జాయింట్ సెక్రటరీ వంకినేని భాను ప్రకాష్ ఈ బ్యాచ్‌ను శతాబ్ది బ్యాచ్ అని ప్రశంసించారు. గ్రీష్మ, డాక్టరు హేమలత, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ఆచార్యులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

భీమడోలు : అంబర్‌పేటలో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరిగింది. ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మణరావు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామంలో పర్యటించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య పరిరక్షకులు శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రేపల్లెవాడ జంక్షన్ రోడ్డును పట్టించుకోండి మహాప్రభో..

పోలవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో తహసీల్దారు కార్యాలయం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకూ రోడ్డు భారీ గోతులతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించాల్సిన ఇటుకల కోట, పైడిపాక, కొత్త రామయ్యపేట, కొత్తదేవరగొంది, వింజరం, కొత్తతోట గొంది పునరావాస గ్రామాల ప్రజలు పోలవరం చేరుకుని అక్కడి నుంచి దొండ పూడి, కన్నాపురం , కొయ్యగూడెం, జంగారెడ్డిగూడెం ప్రయాణాలు చేయవలసి వస్తోంది. ఆ మార్గంలో నిత్యం బుట్టాయగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఆ మార్గంలో రోడ్డు భారీ గోతులతో ఇబ్బందికరంగా ఉండడంతో కొన్ని సందర్భాల్లో ఆర్టీసి బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ రోడ్డ దుస్థితి వల్ల గుంజవరం నుంచి రాజమహేంద్రవరం సర్వీసులు తిరిగే బస్సు సర్వీసుని ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న రోడ్డు

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో మెగా ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించినట్టు డాక్టర్ శ్రీకృష్ణ తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదహారేళ్లగా వైద్య సేవలందిస్తూ సామాజిక సేవలో భాగంగా ప్రతి నెలా రెండవ శనివారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహిస్తూ ఎముకలు, కీళ్ల వ్యాధులకు ఉచిత వైద్యం మందులు అందజేస్తున్నామన్నారు. ఉచిత రక్తపరీక్షలు, ఎక్స్‌రే, బోన్ డెన్సిటీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



విఖనస మహర్షి జయంతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రీవిఖనస మహర్షి జయంతి విఖనస ఆలయంలో అర్చకులు, ఆగమ విద్యార్థులు శనివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా విఖనస ఆలయాన్ని పూలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. విఖనస మహర్షి శిష్యులైన అత్రి, కశ్యపుడు, మరీచి, భృగువుతో కొలువుదీరిన ప్రాంతాన్ని సైతం పూలతో అలంకరించారు. మహావిష్ణువే గురువుగా సమస్త వేదాలు, భాగవత్ శాస్త్రాన్ని బోధించినట్టు పురాణాలు చెబుతున్నాయి.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఏలూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమంతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చెయ్యడమే లక్ష్యమని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలను ఉన్నతస్థితిలోకి తీసుకురావాలనే ఆలోచనతో చేపట్టిన పి4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారితో రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయించి వారికి అండగా నిలిచిన ఇనుగంటి సుధీర్‌ను అభినందించారు. ఆయనతో కలిసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జక్కుల లోహిత్‌సాయికి 47వేల రూపాయలు, ఉప్పు పవన కుమారికి రూ.32 వేల 500 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. మండలంలో ఉన్నత స్థాయిలో ఉన్నవారు మార్గదర్శులుగా మారాలని కోరారు. అనంతరం గ్రామంలో ఉన్న మేరీమాత ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు భూములు అన్యాక్రాంతమవుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. శనివారం ఏలూరు రూరల్ మండలం సోదిమెళ్ల గ్రామంలో ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద తమ్మిలేరు భూమిని కొందరు భూస్వాములు ఇనుప కంచెలు వేసి ఆక్రమించుకున్నారని అన్నారు. తమ్మిలేరును ఆనుకుని ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు భూస్వాములు ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

దెందులూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దెందులూరు గ్రామం ఇంద్రవనం వీధిలో శ్రీ అభయ అంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రముఖులు తణుకు ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ మొటపర్తి రాజా, రాజేశ్వరి శ్రీమతి దంపతులు, సంపంగి అప్పారావు, సుగ్గిశెట్టి నూకరాజు పద్మశ్రీ దంపతులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్టు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ తెలిపింది.

ఆక్వా మందుల దుకాణంలో అగ్నిప్రమాదం

కైకలూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆక్వా మందుల దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి కైకలూరు నీలం సంజీవరెడ్డి వారపు సంతలో వాసవి ఆక్వా మందుల దుకాణంలో హైడ్రో జన్ పెరాక్సైడ్ లీక్ అయి అగ్నిప్రమాదం చోటు చేసు కుంది. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమా చారం అందించగా హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదాన్ని త్వరితగతిన గుర్తించ డంతో భారీ నష్టం వాటిల్లకుండా అదుపు చేశారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

నూజివీడు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి శ్రీరఘునాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను ఈ నెల 29వ తేదీలోపు గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో తమ దరఖాస్తును దాఖలు చేయాలన్నారు. హిందువులై ఉండి 30 ఏళ్ల పైబడిన, సత్ప్రవర్తన కలిగి ఉన్నవారు, కుల ధ్రువీకరణ, పోలీస్ విచారణ సర్టిఫికెట్లతో తమ దరఖాస్తులను దాఖలు చేయాలన్నారు.



పోలవరంలో తమ్మిలేరు కాల్వపై కొత్తగా నిర్మించిన కల్వర్టు

కల్వర్టు నిర్మాణంతో తొలగిన రైతుల వెతలు

చాట్రాయి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామంలో తమ్మిలేరు ప్రాజెక్టు మేజర్-2 కాల్వపై కొత్తగా కల్వర్టు నిర్మించటంతో దశాబ్దాలుగా రైతులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. సుమారు 100 ఎకరాలు తమ్మిలేరు ప్రాజెక్టు ఆయకట్టు భూములలోకి వెళ్ళేదారి లేక ఖరీఫ్ రబీ సీజన్లలో రైతులు పంటలు ఇంటికి తెచ్చుకోవటానికి, భూముల్లోకి వెళ్ళటానికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇక్కడ కల్వర్టు నిర్మించాలని ఎంతో కాలం నుండి రైతులు ప్రజాప్రతినిదులను కోరుతున్నా కార్యరూపం దాల్చలేదు. మంత్రి పార్థసారథి చొరవతో జైకా నిధులు రూ. 6 లక్షలు కేటాయించటంతో, తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మెన్ యర్రా రమేష్, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు(చిట్టిబాబు) కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి ఉపయోగంలోకి తెచ్చారు. తమ భూముల్లోకి వెళ్లటానికి దారి ఏర్పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కలుషిత మంచినీటి చెరువు (ఇన్‌సెట్) సరఫరా అయిన కుళాయి నీరు

కలుషిత నీరే దిక్కు!

▸ముట్టుకుంటే దురదలు, అంటువ్యాధులు

▸పట్టించుకోని పంచాయతీ.. ▸కన్నెత్తి చూడని అధికారులు

ముదినేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులోని పంచాయతీ మంచినీటి చెరువు పూర్తిగా కలుషితమైంది. చెరువులోని నీరు రంగు మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ చెరువులో గుర్రపు డెక్క, తూటుకాడ, తామరాకులు దట్టంగా పెరిగి అడుగు భాగాన అవి కుళ్లి నీటిని కలుషితం చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా సరఫరా చేస్తున్న ఆ నీటినే గత్యంతరం లేని పరిస్థితుల్లో గ్రామస్థులు వినియోగిస్తూ అంటువ్యాధుల బారిన పడుతున్నారు. తాగేందుకు నీటిని కొనుగోలు చేసుకుంటున్నా వాడకానికి ప్రజలు ఈ కలుషిత నీటినే వినియోగిస్తున్నారు. చెరువు నీరు కలుషితమైనప్పటికీ గుర్రపు డెక్క, తామరాకులు తొలగించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కానీ, పంచాయతీ అధికారులు కానీ చర్యలు తీసుకోవటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామస్థులు బోయిన రామారావు, సంపూర్ణమ్మ, ఇల్లా శ్రీదేవి తదితరులు మాట్లాడుతూ కుళాయిల నుంచి కలుషిత నీరే సరఫరా చేస్తున్నారు. కనీసం వాడుకుందామంటే చర్మవ్యాధులు వస్తాయేమోనని భయమేస్తోంది. చెరువులోని డెక్క తొలగించి మంచినీరు నింపాలని లేకుంటే ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిధుల మంజూరుకు విజ్ఞప్తి చేశా : సర్పంచ్

దీనిపై బొమ్మినంపాడు సర్పంచ్ దారం సుధను వివరణ కోరగా మంచినీటి చెరువును బాగు చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు అవసరమైన నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం. సమస్యను ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాలని కోరాను.

మట్టగుంటలోనూ..

కలిదిండి: మట్టగుంటలో తాగునీటి చెరువు నీరు కలుషితమై నీరు తీవ్ర దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వాడుకోవటానికి కూడా ఉపయోగపడటం లేదని స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. సుమారు 20 రోజుల క్రితం చెరువుకి కాల్వ నీరు పెట్టారు. పూర్తిగా తాగునీటి వంతు రాకపోవటంతో చెరువు సగానికి మాత్రమే నీరు పెట్టడంతో ఎండల వేడికి నీటి రంగు మారింది. తాగునీటి చెరువులో చేపలు అధికంగా ఉండటంతో చెరువు నీటిని బురద చేస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల లో బిందె నీరు రూ.10 చొప్పున కొనుగోలు చేసి తాగుతున్నామని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని పేదలు, వృద్ధులు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయమై సర్పంచ్ అంద్రాజు రత్నమణిని వివరణ కోరగా, చెరువులో కలుషిత నీటిని పూర్తిగా తొలగించి కొద్దిరోజులపాటు ఎండగట్టి ఆ తర్వాత బ్లీచింగ్ చల్లించి తాజా తాగునీటితో చెరువును నింపుతామన్నారు.

11 నుంచి క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి. ఏలూరు జిల్లాలో 9 క్రీడాంశాల్లో అండర్-22 పురుషులు, మహిళల జట్లకు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లను జోనల్ పోటీలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ రాణించే క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ నెల 11న జంగారెడ్డిగూడెంలో ఆర్చరీ, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్, ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల్లో బ్యాడ్మింటన్, ఏలూరు కంద్రిక గూడెం బాక్సిట ఫిట్ బాక్సింగ్ అకాడమీలో బాక్సింగ్ పోటీలు, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, కోకో, వాలీబాల్, ఏలూరు ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. 13న అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయి. మరింత సమాచారానికి ఫోన్ నంబరు 98663 17326లో సంప్రదించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు.



చెక్కును ఇస్తున్న సర్పంచ్, నాయకులు

పేదలకు వరం సీఎం సహాయనిధి

ముసునూరు, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమ ని సర్పంచ్ పులిబక్క లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో బాధిత కుటుంబాలకు టీడీపీ నాయకులతో కలసి ఆమె సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. పాముకాటుకు గురై ఆపరేషన్ చేయించుకున్న పొట్టపల్లి భుజంగరావుకు రూ. 46 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి, బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్న కొవ్వలి బోసుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ 1,98,000లు విలువ గల చెక్కులను అందజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్ తదితరలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



జాతీయ జెండాలను అందజేస్తున్న ఏసుపాదం

మండవల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర్య దినోత్సవం పురస్కరించు కొని ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలన్న ఆకాంక్షతో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆర్థిక సాయంతో జెండాలను పంపిణీ చేసేందుకు పార్టీ మండవల్లి మండల అధ్యక్షుడు సమయం ఏసుపాదం శనివారం మండవల్లిలో జెండాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్వాతంత్ర్య ఫలాలను గుర్తు చేసుకుంటూ గ్రామగ్రామాన ప్రతీ పౌరుడు ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఒక పండుగలా జరుపుకునేందుకు ప్రధాని మోదీ సూచించిన విధంగా ఆగస్టు 13, 14, 15వ తేదీలలో ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలనే ఉద్దేశంతో ఈ జాతీయ జెండాలను అంద జేస్తున్నట్లు ఏసుపాదం తెలిపారు.

శ్రీహరిపురంలో బీజేపీ 'గృహ సంపర్క్'

ముదినేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలన పై ముదినేపల్లి మండ లంలో బీజేపీ నాయక ులు గృహ సంపర్క్ కార్యక్రమాన్ని చేప ట్టారు. శనివారం శ్రీహరిపురం పంచా యతీ పరిధిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు కేంద్రం దేశ అమలు చేస్తున్న పథకాలను ఇంటింటా ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. పీఎం కిసాన్, రహదారుల అభివృద్ధి, సబ్సిడీపై వంట గ్యాస్ పథకాలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, పార్టీ నాయకులు మేలిమి చిట్టిబాబు, పసుపులేటి నరసింహారావు, చిట్టూరి శివప్రసాద్, కొల్లిపర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై పోరు

(5వ పేజీ తరువాయి)

వినియోగించకూడదు. ఆలయాల పరిధిలో వ్యాపారస్థులకు ప్లాస్టిక్ నిషేధం అమలుపై నోటీసులు జారీచేయాలి. వ్యాపారులతో సమావేశాలు జరిపి కమిషనర్ ఉత్తర్వులపై స్పష్టత ఇవ్వాలి. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలపాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వలంటీర్లు, సిబ్బందితో అప్రమత్తం చేయాలి. ఆలయాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా.. ప్లాస్టిక్ వాడకం నిషేధంపై తాము తీసుకున్న చర్యలను సూచిస్తూ ప్రతీనెల కమిషనర్ కార్యాలయానికి ఆలయ అధికారులు నివేదికలను పంపాలి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

గంజాయి వలలో యువకులు..

ఆలపాడులో పోలీసుల తనిఖీలు

రెండున్నర కేజీల గంజాయి స్వాధీనం

కైకలూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుకు అలవాటు పడడంతో పాటు దాని విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 2.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్ తెలిపారు. శనివారం కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం కైకలూరు మండలం ఆలపాడు కోఆపరేటివ్ బ్యాంకు వద్ద రూరల్ ఎస్సై వి. రాంబాబు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో విచారణ చేశారు. వారు గంజాయి సేవించి ఉండడంతో పాటు వారి వద్ద 2.5 కేజీలు ఉన్నట్లుగా గుర్తించారు. వీరు కైకలూరు మండలం సింగాపురం గ్రామానికి చెందిన గురువెల్లి బాలసాయిరామిరెడ్డి, చటాకాయ గ్రామానికి చెందిన జయమంగళ లక్ష్మీనారాయణ, కైకలూరు టౌన్‌కు చెందిన నరహరశెట్టి వెంకట అవినాష్‌లుగా గుర్తించారు. వీరిలో రామిరెడ్డి 2015-2018 వరకు విశాఖలో హోటల్‌మేనేజ్‌మెంట్ కోర్సును విద్యనభ్యసించాడు. ఆ సమయంలో గంజాయి మత్తుకు అలవాటుపడ్డాడు. విద్య పూర్తిచేసిన తరువాత హైదరాబాద్, విజయవాడ, మలేషియాలో ఉద్యోగం చేశాడు. ఆ సమయంలో గంజాయిని సేవిస్తూనే ఉన్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి ఆకివీడులోని తన స్నేహితుడి ద్వారా గంజాయిని సేవించడమేగాక పలువురికి అమ్మకాలు సాగించాడు. ఆకివీడులోని అతని స్నేహితుడిని 10 రోజుల క్రితమే గంజాయి కేసులో పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ రామిరెడ్డి విశాఖపట్నం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని లాకవరం గ్రామం నుంచి గంజాయిని తీసుకువస్తున్నాడు. గతంలో కూడా ఆ ప్రాంతంలో గంజాయి కేసు నమోదు అయినట్లు తెలిపారు. తీసుకువచ్చిన గంజాయిని లక్ష్మీనారాయణ, అవినాష్‌లతో కలిసి కైకలూరు పరిసర ప్రాంతాల్లో పలువురు యువకులకు విక్రయిస్తున్నాడు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. వీరికి గంజాయి కేసులో అరెస్టు అయితే 21 సంవత్సరాలు శిక్షపడే అవకాశం ఉంటుందని ఎక్కడన్నా గంజాయి అమ్ముతున్నా, విక్రయించినా 112, 1972 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. వీరి ముగ్గురిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సై రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్



పాడి రైతులకు బోనస్ పంపిణీ

చాట్రాయి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్‌కు అనుబంధంగా ఉన్న మండలంలోని చాట్రాయి, బూరుగుగూడెం, మంకొల్లు పాల సహకార సంఘాల్లో శనివారం పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. 2025-26 సంవత్సరానికి మొదటి విడత బోనస్ చాట్రాయిలో రూ. 1.68 లక్షలు, బూరుగుగూడెంలో రూ. 2.28 లక్షలు, మంకొల్లులో రూ. 43,770 పంపిణీ చేశారు. సంఘాల అధ్యక్షులు ఎస్. పుల్లారెడ్డి, జి.రాధారుక్మిణి, ఐ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఆగిరిపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో ఫాగింగ్ చేయించినట్లు ఆగిరిపల్లి సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి తెలిపారు. వర్షాకాలం కారణంగా పరిశుభ్రత పాటించకపోతే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: చిత్తపూరులో వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం దోమల మందు పిచికారీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, మురుగునీరు నిల్వ లేకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సోమశేఖర్, ఏఎన్ఎం సామ్రాజ్యం, ఎంఎల్‌హెచ్‌పి వీరాస్వామి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి విద్యార్థి బలి

ముదినేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి ఓ విద్యార్థి బలయ్యాడు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న మెండెల అంజయ్య, తిరుపతమ్మ కుమారుడు మెండెల ఏసురాజు (13) శనివారం సాయంత్రం మోటార్ స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. కుమారుడి మరణంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన నూలు వెంకట వరలక్ష్మి తీవ్ర గాయాలకు గురైంది. పెదపాలపర్రు నుంచి ఈ నెల 4వ తేదీ రాత్రి 7 గంటలకు తిరిగి వస్తుండగా కలవపూడి సత్రవ సమీపంలో వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న బైక్ ఆమెను ఢీకొంది. రోడ్డుపై పడిపోయిన ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమె అందించిన సమాచారం మేరకు వరలక్ష్మి కుమారుడు వెంకట రమణకు స్థానికులు ఫోన్ చేసి చెప్పగా వెంటనే అక్కడికి వచ్చి తల్లిని 108లో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.



చాట్రాయిలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



ఆగిరిపల్లిలో రాఖీ పండుగ



ప్రొద్దువాకలో ఏపీటీడీసీ డైరెక్టర్ వినోద్‌కు రాఖీ కడుతున్న మహిళ



సోదరురికి రాఖీ కడుతున్న సోదరీమణులు

అన్నా.. నీ అనురాగం

▸ఉత్సాహంగా రక్షాబంధన్ ▸పొరుగూళ్ల నుంచి వచ్చి మరీ రాఖీలు కట్టిన సోదరిలు

చాట్రాయి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు చిహ్నమైన రాఖీ పండుగను వేడుకగా జరుపుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా అక్క చెల్లెళ్ళు వ్యయ ప్రయాసలను లెక్క చెయ్యకుండా వచ్చి తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి, సోదరులు ఇచ్చిన బహుమతులు స్వీకరించారు. అలాగే చాలా మంది సోదరులు తమ అక్క చెల్లెళ్ళ వద్దకు వచ్చి రాఖీలు కట్టించుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా రాఖీలు అమ్మే దుకాణాలు, స్వీట్ షాపులు కొనుగోలుదారులతో సందడిగా కన్పించాయి.

ఆగిరిపల్లి: రాఖీ పౌర్ణమిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్క చెల్లెళ్ళు తమ సోదరులకు రాఖీలు కట్టారు. నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలంటూ హారతులు పట్టారు. సోదరులు తమ అక్కచెల్లెళ్లకు బహుమతులు అందజేశారు.

కలిదిండి: కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరికి పలువురు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సార్పీ అగ్రహారంలో జనసేన సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ నల్లగోపుల చలపతిరావుకు వీర మహిళలు రాఖీలు కట్టారు.

ముదినేపల్లి: రాఖీ పండుగ సందర్భంగా శనివారం ముదినేపల్లిలోని రాఖీల దుకాణాలు యువతులతో కిటకిటలాడాయి. ప్రొద్దువాకలో జరిగిన ఓ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్‌కు ఓ మహిళ రాఖీ కట్టారు.

నూజివీడు టౌన్: రాఖీ పౌర్ణమిని నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టారు.



రహదారి మార్జిన్ ఆక్రమించిన దృశ్యం

రహదారినే ఆక్రమించేశారు!

ముసునూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలివే-వెంకటాపురం ప్రధాన రహదారి మార్జిన్ ఆక్రమణకు గురైంది. సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారి అంచును ఆక్రమించుకుని, ముళ్ళకంచెలు వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలను తొలిగించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ వ్యాన్‌లు, ఇసుక ట్రాక్టర్లు, పామాయిల్ లోడ్‌తో లారీలు తదితర వాహనాలు నిత్యం వందల సంఖ్యలో తిరుగుతాయని, ఎదురుగా వాహనం వస్తే కనీసం పక్కకు తప్పుకునేందుకు కొంచెం మార్జిన్ కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. రోడ్డు అంచుకు వరకు అక్రమించుకోవడంతో ఈ రహదారిలో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఆక్రమణలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికి స్పందన లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రహదారి మార్జిన్ ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



పసుపు అలంకరణలో శ్రీలక్ష్మమ్మ, అమ్మవార్లు

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

చాట్రాయి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగొలనుపేటలో శ్రీలక్ష్మమ్మ, అంకమ్మ వార్ల ఆలయ పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మండలంలోని గ్రామాల నుంచే కాక చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రొద్దువాక కృష్ణ మందిరంలో..

ముదినేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామంలో శ్రీ కృష్ణమందిరం ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్థానిక యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కృష్ణుడికి పూజలు జరిపారు. ఏపీటీడీసీ డైరెక్టర్ కొడాలి వినోద్‌తోపాటు స్థానిక టీడీపీ నాయకులు వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

ఘనంగా ఏపీ నిట్ స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెంఅర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీల్లో భారత్ అగ్రగామిగా ఉందని టాటా సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న అన్నారు. శనివారం తాడేపల్లిగూ డెంలోని ఏపీ నిట్‌లో ఏడో స్నాతకోత్సవ వేడుకను ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు డిజిటల్ టెక్నాలజీలే ప్రధాన చోదకశక్తిగా మారనున్నాయన్నారు. దేశభవిష్యత్‌ను నిర్ణయించేది యువ ఇంజనీర్లేనని ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించబోతుందన్నారు. 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు, యూపీఐ ద్వారా ఏటా వంద బిలియన్లకుపైగా లావాదేవీలు నిర్వహిస్తుం దన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నచ్చిన పుస్తకాలను చదవడం, సంగీతం వినడం ద్వారా ఒత్తిడిని అధికమించవచ్చన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రమణారావు మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త సాంకేతికతలు ఆవిష్కృతమవుతు న్నాయని వాటిలో మెలకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారే అగ్రస్థానాల్లో నిలదొక్కుకుం టారన్నారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ నూతన ప్రాజెక్టులు చేపడితే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అనంతరం 2021-25 బ్యాచ్‌లో బీటెక్‌లో నాలుగేళ్ల ఇంజనీరింగ్ పూర్తి చేసిన 887 మంది విద్యార్థులకు డిగ్రీలు, పీహెచ్‌డీ పూర్తి చేసిన 29 మందికి డాక్టరేట్ పట్టాలతో బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జీ.రవికిరణ్‌శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎస్.జయరాం, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై 'పాకా' అసహనం

స్నాత కోత్సవ వేడుకలలో ఏపీ నిట్ అధికారుల తీరును రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ తప్పుబట్టారు. వాస్తవానికి తాడేపల్లిగూడెం ఏపి నిట్‌లో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీలు, డాక్టరేట్ పట్టాలను అందుకోనున్న విద్యార్థుల తల్లిదండ్రులను నిట్ అధికారులు పిలిచారు. తమ పిల్లలు పట్టాలు తీసుకునేప్పుడు చూసి ఆనందిద్దామన్న ఆశతో విద్యా ర్థుల తల్లిదండ్రులు తమ కుటుంబసభ్యులతో సుమారు రెండు వేల మంది హాజరయ్యారు. అయితే నిట్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆడిటోరియంలో 800 మంది మాత్రమే వెళ్లగలుగుతారు. తొలుత వచ్చిన వారినందరిని అధికారులు ఆడిటోరియంలోకి పంపించారు. స్థలం సరిపోని కారణంగా చాలామంది ఆడిటోరియం వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో వారందరూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అప్పుడే కార్యక్రమానికి వచ్చిన రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకోగా అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావుతో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలన్నారు.



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి రాజన్న